www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

RNI No: TELTEL/2024/86684

శనివారం | 21.06.2025 | సంపుటి : 2 | సంచిక :140 | పేజీలు : 8 | వెల : 2/-




మొదటి రోజు భారత్‌దే 07


**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




ట్రంప్ అమెరికా ఆహ్వానాన్ని

# తిరస్కరించా

## ఒడిశా పర్యటనకే ప్రాధాన్యమిచ్చి ఇక్కడకు వచ్చాను

## భువనేశ్వర్ సభలో ప్రధాని మోదీ వెల్లడి

**భువనేశ్వర్ :** వాషింగ్టన్‌ను సందర్శించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించినట్లు ప్రధాన మోదీ వెల్లడించారు. వివిధ అంశాలపై వాషింగ్టన్‌లో చర్చించుకుందామని, కలిసి లంచ్ చేద్దామని ట్రంప్ తెలిపారన్నారు. ఇటీవల జీ7 సదస్సులో పాల్గొనేందుకు కెనడా వెళ్లినప్పుడు ట్రంప్ ఫోన్ చేసి మాట్లాడారని మోదీ పేర్కొన్నారు. ఒడిశాలో భాజపా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా శుక్రవారం భువనేశ్వర్‌లో నిర్వహించిన సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ ఈ విషయం చెప్పారు. 'కెనడా నుంచి తిరిగి వెళ్లే సమయంలో అమెరికా రావాలని పిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపా. ట్రంప్ ఆహ్వానాన్ని సున్నితంగా నిరాకరించా. పరమపవిత్ర జగన్నాథుడు వెలసిన ఒడిశా రాష్ట్రానికి వెళ్లాల్సి ఉందని చెప్పాను. ఆ భగవంతుడిపై భక్తే నన్ను ఇక్కడకు తీసుకొచ్చింది' అని ప్రధాని మోదీ వెల్లడించారు. అమెరికా వెళ్లడం కన్నా ఒడిశా సందర్శనే తనకు ముఖ్యమని పేర్కొన్నారు.

మిగతా 2 లో

# చర్చించుకుందాం

## 23న మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం

### అవసరమైతే ఏపీ సీఎంను మేమే ఆహ్వానిస్తాం..

### ఏపీతో విభేదాలు కోరుకోవడం లేదు.. అలాగని రాజీ పడే ప్రసక్తే లేదు



- అదే సమయంలో తెలంగాణ హక్కులను వదులుకోం
- బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- సమస్యకు మూలకారణం కేసీఆర్, హరీశ్‌రావులేనని ఆరోపణ
- బనకచర్లకు బీజం 2016లోనే.. అప్పుడే కోర్టుకు ఎందుకు వెళ్లలేదు!?
- రాజకీయంగా చచ్చిన బీఆర్ఎస్‌కు సంజీవనిగా జలవివాదాలు
- కిషన్‌రెడ్డికి కేటీఆర్ ట్యూషన్ మాస్టర్.. ఆయన చెప్పిందే చేస్తారు
- భాజపాకు భారాస 'అవయవదానం'లా సీట్లిచ్చిందని విమర్శ

**న్యూఢిల్లీ, జూన్ 20 :** "ఇరు రాష్ట్రాలు కూర్చొని మాట్లాడుకుంటే గోదావరి-బనకచర్ల సమస్య పరిష్కారమవుతుంది. ఇలా చర్చించుకోవడంలో మాకేమీ భేషజాలు లేవు. అలాగని తెలంగాణ హక్కులను కోల్పోవడానికి సిద్ధంగా లేం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన దిల్లీలోని తన అధికార నివాసంలో విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టు పెట్టింది మాజీ సీఎం కేసీఆర్, నాటి ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావులేనని ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీల వాటా సరిపోతుందని 2015లో లేఖ ఇచ్చింది హరీశ్‌రావేనని, గోదావరి వరద నీటిని పెన్నా పరీవాహక ప్రాంతానికి తరలించడానికి అభ్యంతరం లేదంటూ 2016 నాటి ఎపెక్స్ కౌన్సిల్‌లో చెప్పింది కేసీఆరేనని ధ్వజమెత్తారు. అందుకు సంబంధించిన లేఖలు, మీటింగ్ మినిట్స్‌ను రేవంత్‌రెడ్డి మీడియాకు విడుదల చేశారు. "ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రతిపాదనలపై ముందుగా తెలంగాణ ప్రభుత్వ అభిప్రాయం అడిగి ఉండాల్సింది. ఎపెక్స్ కౌన్సిల్ వంటి మార్గాల్లో కాకుండా.. ఏపీ సీఎం చంద్రబాబు నేరుగా బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ నివేదిక (పీఎఫ్ఆర్)ను కేంద్రానికి సమర్పించడం అభ్యంతరకరం. ఆంధ్రప్రదేశ్ మాకు దిగువన ఉంటే.. మేం కర్ణాటక, మహారాష్ట్రలకు దిగువన ఉన్నాం. ఏ రాష్ట్రంతోనూ మేం వివాదాలు కోరుకోవడంలేదు.

మిగతా 2 లో

'గోదావరి – బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా ఇతర జల వివాదాలపై రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులం కలిసి కూర్చుని మాట్లాడుకుందాం. ఈనెల 23న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఉంది. అందులో చర్చించి, ఆ తర్వాత నేనే ఒకడుగు ముందుకేసి చంద్రబాబును చర్చలకు ఆహ్వానిస్తా" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రానికి ఏపీ ప్రీ ఫీజిబులిటి రిపోర్ట్ (పీఎఫఆర్) ఇవ్వడం వల్లే వివాదం మొదలైందన్నారు. పీఎఫఆర్ ఇచ్చే ముందే తెలంగాణతో చర్చించి ఉంటే వివాదం ఉండేది కాదన్నారు. ఏపీతో విభేదాలు కోరుకోవడం లేదని, అలాగని రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.



బ్యాంకింగ్ వ్యవస్థలోనే

**లోపాలున్నాయి**

- ఛార్జీల పేరుతో సామాన్యులపై భారం వేస్తున్నారు
- రూ.వేల కోట్లు ఎగవేసిన వారిని వదిలేస్తున్నారు
- బ్యాంకు అధికారుల తీరుపై హైకోర్టు వ్యాఖ్యలు

03



06

ఎన్నికల వీడియోలు..

45 రోజుల తర్వాత

**తొలగించండి**

రాష్ట్రాలకు ఈసీ సూచన



06

**15 రోజుల్లోనే కొత్త ఓటరు కార్డు**



06

8 ఎయిరిండియా


**విమాన సర్వీసులు రద్దు**



07

యాపిల్.. ఫేస్‌బుక్.. గూగుల్.. 16 బిలియన్ల

**పాస్‌వర్డ్‌లు లీక్**



04

మాపై దాడులు ఆపాలని

**భారత్‌ను అడిగాం**

పాక్ ఉప ప్రధాని



04

నా వీర్యదానంతో జన్మించిన

**100 మందికి సంపద పంచేస్తా**



ఆరోగ్య ప్రదాయిని

# యోగా

- 24 గంటల కౌంట్‌డౌన్ వేడుకల్లో వక్తలు
- ఎల్బీ స్టేడియంలో అట్టహాసంగా నిర్వహణ

03

ఆరోగ్యంగా ఆనందమయ జీవితం గడపడానికి యోగా ఎంతో దోహదం చేస్తుందని వక్తలు తెలిపారు. ప్రపంచానికి భారత్ అందించిన గొప్ప వరం యోగా అని, ప్రధాని మోదీ చొరవతో అన్ని దేశాలు యోగా దినోత్సవాన్ని జరుపుకొంటున్నాయని పేర్కొన్నారు. ఒత్తిడి, ఆందోళనతో సతమతమవుతోన్న ప్రస్తుత యువత వారి దినచర్యలో దీన్ని భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో '24 గంటల కౌంట్‌డౌన్ వేడుకలు' పేరుతో శుక్రవారం యోగా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రైవేట్ స్కూళ్ల

# విద్యా వ్యాపారం

- తడిసి మోపెడవుతున్న చదువు భారం
- పుస్తకాలు కావాలంటే జేబు గుల్ల
- కొరవడిన విద్యాశాఖ పర్యవేక్షణ

03

ప్రైవేటు పాఠశాలల తీరుపై విద్యాశాఖ అధికారుల్లో పూర్తిగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. కనీస వసతులు కరవైనా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. అనుమతులు సహా ఇతర వ్యవహారాల్లోనూ పర్యవేక్షణ కొనసాగించడం లేదు. కమీషన్లతో వ్యాపారం .. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఆయా పుస్తక విక్రయ దుకాణాలతో ముందస్తు ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్నాయి.





# పోలవరంతో భద్రాచలం మునక

- రాముడు తెలంగాణలో.. భూములు ఎపిలో
- ఎపిలో కలిపిన ఐదూళ్లు వెంటనే వెనక్కి ఇచ్చేయాలి
- తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత డిమాండ్

03



పోలవరం నిర్మాణంతో భద్రాచంల పూర్తిగా మునిగిపోవడం ఖాయమని, అందుకే తాము పోలవరం ప్రాజెక్టు నిర్వహణ అంశాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే వ్యతిరేకించామని భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. అప్పట్లో తాము సుప్రీంకోర్టుకు వెళ్లి ఆపే ప్రయత్నం చేసినా ప్రాజెక్టు ఆగలేదని తెలిపారు.



# సన్న వడ్ల బోనస్ బోగసే

- ఇంకా విడుదల కాని రూ. 1,161 కోట్ల బోనస్
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు

02

కడియం శ్రీహరిది

# నల్లికుట్ల వ్యవహారం

- నా మంత్రి పదవి పోతుందని ప్రచారం చేస్తాడా
- టిడిపిలో సాగించుకున్నట్లు ఇక్కడ సాగదు
- నాముందు కూర్చోవాలంటేనే నామోషీగా ఫీలవుతున్నారు
- మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి కొండా సురేఖ విమర్శలు

02

నా మంత్రి పదవి పోతుందంటూ కడియం శ్రీహరి తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని మంత్రి కొండా సురేఖ మండిపడ్డారు. తన ముందు కూర్చోవడానికి కడియం నామోషీగా ఫీలవుతున్నారని అన్నారు. మీడియాతో ఆమె ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. పలు అంశాలపై స్పందించారు. కడియం శ్రీహరిపై విమర్శలు గుప్పించారు. ఈసందర్భంగా ఉమ్మడి వరంగల్‌లోని కాంగ్రెస్ కీలక నేతలపై మంత్రి కొండా సురేఖ హాట్ కామెంట్స్ చేశారు. స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నల్లికుట్ల మనిషి అని ఆరోపించింది.





# ట్రంప్ అమెరికా ఆహ్వానాన్ని తిరస్కరించా

- ఒడిశా పర్యటనకే ప్రాధాన్యమిచ్చి ఇక్కడకు వచ్చాను
- భువనేశ్వర్ సభలో ప్రధాని మోదీ వెల్లడి

**భువనేశ్వర్, జూన్ 20 :** ఒడిశాలో మొదటిసారిగా ఏర్పడ్డ బీజేపీ ప్రభుత్వం సుపరిపాలన, ప్రజా సేవలతో విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసిందని.. ఇది ఎంతో ప్రత్యేకమైన రోజని ప్రధాని మోడీ అన్నారు. ఈ వార్షికోత్సవం కేవలం ప్రభుత్వ వార్షికోత్సవం మాత్రమే కాదని.. ఇది సుపరిపాలన స్థాపన వార్షికోత్సవమని అభివర్ణించారు. ఏడాదిలో ప్రజలకు సుపరిపాలన అందించిన ముఖ్యమంత్రి మోహన్ మాఝి, ఆయన మొత్తం బృందాన్ని అభినందిస్తున్నానని అన్నారు. కాగా, 2024 జూన్ లో జరిగిన ఒడిషా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీని మట్టికరిపించి.. ఒడిషా రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా అక్కడ బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రాష్ట్రాల్లో సామాజిక ఆర్థిక అభివృద్ధి విషయంలో నవశకం ప్రారంభమైందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బిహార్ నుంచి ఒడిశా పర్యటనకు వెళ్లిన ఆయన.. రూ.18,600 కోట్ల విలువైన 105 ప్రాజెక్టులను ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాని మాట్లాడారు. సుపరిపాలన, ప్రజాసేవలో ఒడిశాలోని భాజపా ప్రభుత్వం విజయవంతంగా ఒక ఏడాది పూర్తి చేసుకుందని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆహ్వానాన్ని తాను సున్నితంగా తిరస్కరించానని ప్రధాని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. 'జీ7 సదస్సు కోసం కెనడా వెళ్లినప్పుడు ట్రంప్ ఫోన్ చేశారు. వాషింగ్టన్ మీదుగా వెళ్లాలని సూచించారు. విందులో పాల్గొని చర్చించుకుందామని పిలిచారు. జగన్నాథుడి పుణ్యభూమికి వెళ్లడం నాకు ముఖ్యమని చెప్పా. ఆయన ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించా'అని చెప్పారు. పూరీ జగన్నాథ ఆలయంలోని రత్న భాండాగారాన్ని తెరవాలన్న ప్రజల డిమాండ్‌ను భాజపా ప్రభుత్వం నెరవేర్చిందని మోదీ చెప్పారు. కాంగ్రెస్ పాలనలో భారత్‌లో సుపరిపాలనకు చోటు లేకపోయిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఒడిశా అవినీతి కేంద్రంగా నిలిచిందన్న ప్రధాని.. మౌలిక సదుపాయాల కల్పనలో అప్పటి ప్రభుత్వం విఫలమైందన్నారు. చాలా ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయని, క్రమంగా వాటిని అభివృద్ధి చేసేందుకు భాజపా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా రూ.18,600 కోట్ల విలువైన 105 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. 'ఒడిశా విజన్ డాక్యుమెంట్'ను ఆవిష్కరించారు. అలాగే పలు కొత్త రైళ్లను ప్రారంభించారు. ఒడిశా పర్యటన అనంతరం.. ప్రధాని విశాఖకు రానున్నారు. రాత్రి అక్కడే బస చేసి, శనివారం ఉదయం ఆర్కే బీచ్‌లో నిర్వహించబోయే యోగా కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# కాళేశ్వరం దండగమారి ప్రాజెక్ట్

- దానిపై మరిన్నినిధులు వృధా చేయడం తగదు
- సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, జూన్ 20 :** కాళేశ్వరం ప్రాజెక్టు దండగమారి ప్రాజెక్ట్ అని, దానిపై అనవసరంగా నిధులు వృధా చేయవద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగిందని, ఇంకా నష్టాలను ప్రజలపై రుద్దవద్దన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు తీసేసి.. వాటిలోని పైపులను వాడుకోవాలని సూచించారు. ఆ మూడు బ్యారేజీల మరమ్మతులకు రూ.20వేల కోట్లు ఖర్చు అవుతోందని, అంత ఖర్చు పెట్టినా వరద ఉధృతి వల్ల బ్యారేజీలు కొట్టుకుపోయే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారని అన్నారు. ఆ మూడు ప్రాజెక్టులకు పెట్టే ఖర్చుకు బదులు ప్రాణహిత పూర్తి చేస్తే సరిపోతుందని అభిప్రాయపడ్డారు. 3 ప్రాజెక్టులు తీసేయడం వల్ల కేవలం రూ.10వేల కోట్ల నష్టం వస్తుంది. వీటికి మరమ్మతులు చేసే బదులు శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులో గోదావరిపై 14 చిన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం వృథా అని నేను చెప్పలేదు. కేవలం ఆ మూడు బ్యారేజీలపై మాత్రమే మా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాం. తెలంగాణను సంప్రదించకుండా ఏపీ సీఎం చంద్రబాబు ప్రాజెక్టులు చెపడుతున్నారు. బనకచర్ల ప్రాజెక్టును ఆపేయాలి. పరివాహక ప్రాంతాల వారీగా నిబంధనల మేరకు నీటి వాటాలు జరగాలి. ఇద్దరు సీఎంలు కూర్చొని బనకచర్ల ప్రాజెక్టుపై మాట్లాడుకోవాలన్నారు. నీటి ప్రాజెక్టులపై రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదు. పోలవరం ప్రాజెక్టు కడుతున్న ఏపీకి కొత్త ప్రాజెక్టులు ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే కూనంనేని కోరారు. ఉన్న ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలన్నారు.

# కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక కోరాం

## పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, జూన్ 20 :** మాజీ ఎమ్మెల్సీ, మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక కోరామని, డీసీసీ పరిశీలకుడి నుంచి నివేదిక వచ్చాక స్పందిస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కొండా మురళి పరకాల సీటుపై రేవూరి ప్రకాశ్ రెడ్డిపై ఘాటు వ్ఆయఖ్యలు చేశారు. ఇకపోతే సంబంధం లేని పంచాయతీ ఎన్నికలపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడటం సరికాదని ఆయనకు సూచించినట్టు తెలిపారు. న్యాయస్థానంలో ఉన్న అంశంపై పొంగులేటి మాట్లాడటంపై తాను అభ్యంతరం వ్యక్తం చేసినట్టు వివరించారు. పార్టీ కార్యకర్తలను ఉత్సాహపరిచేందుకు మాట్లాడిన మాటలే తప్ప వేరే ఉద్దేశం కాదని పొంగులేటి చెప్పినట్లు వివరించారు. న్యాయస్థానం తీర్పు తర్వాతనే పంచాయతీ ఎన్నికలు ఉంటాయని పీసీసీ అధ్యక్షుడు స్పష్టం చేశారు. మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా తమ పరిధిలో లేని అంశాలను మాట్లాడవద్దని సూచించారు. ఇతరుల శాఖల్లో ఎవరూ జోక్యం చేసుకోవద్దని స్పష్టం చేశారు. విధానపరమైన అంశాల విషయంలో పార్టీపరంగా చర్చించి, మంత్రి మండలిలో నిర్ణయం తీసుకున్న అంశాలపై మాట్లాడితే ఎలాంటి అభ్యంతరం ఉండదని వివరించారు. అలా కాకుండా అంతర్గతంగా మాట్లాడుకున్న అంశాలను మీడియాతో మాట్లాడవద్దని మాత్రమే తాను చెప్పినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో తానే అభ్యర్థిని అని అజహరుద్దీన్ మాట్లాడటంలో తప్పు లేదన్న మహేశ్‌కుమార్‌గౌడ్.. గతంలో పోటీ చేసినందున తిరిగి తననే పోటీలో నిలుపుతారన్న భావనతో చెప్పి ఉంటారని అభిప్రాయపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలన్న కృతనిశ్చయంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్లు వివరించారు.

# చర్చించుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

అదే సమయంలో తెలంగాణ హక్కులనూ వదులుకోబోం. మాకున్న అనుమానాలపై చర్చించి పరిష్కరించుకోవాలనుకుంటున్నాం. దీనిపై ఈ నెల 23న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తాం.. అవసరమైతే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని మేమే చర్చలకు ఆహ్వానిస్తాం. ముందు ముఖ్యమంత్రుల స్థాయిలో చర్చించుకొని తర్వాత ఎపెక్స్ కౌన్సిల్‌కు వెళ్తాం.

### భారాస అప్పుడెందుకు మాట్లాడలేదు?

జలాల తరలింపునకు పునాది పడిందే హరీశ్‌రావు సాగునీటిశాఖ మంత్రిగా ఉన్నప్పుడు. గోదావరి వరద జలాలను రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అవసరాల కోసం తరలించేందుకు డీపీఆర్ తయారు చేసే బాధ్యతను వాప్కోస్‌కు అప్పగిస్తూ 2016 ఏప్రిల్ 16న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో నంబరు 262ను జారీ చేసింది. ప్రకాశం బ్యారేజీ నుంచి పెదగంజాం వయా కమ్మమూర్ కెనాల్ వరకు నీటి తరలింపు, గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి సంగం బ్యారేజీకి వరదజలాల తరలింపు కోసం మరో డీపీఆర్ తయారీ బాధ్యతను అదే వాప్కోస్‌కు అప్పగిస్తూ ఏపీ ప్రభుత్వం 2018 మార్చి 29న జీవోఆర్‌టీ నం.230 విడుదల చేసింది. ఆనాడు తెలంగాణ నీటిపారుదల మంత్రిగా ఈ జీవోల గురించి నోరెత్తని హరీశ్‌రావు.. ఇప్పుడు పెద్దపెద్ద ఉపన్యాసాలిస్తున్నారు. గోదావరి నుంచి పెన్నా పరీవాహక ప్రాంతానికి 400 టీఎంసీల నీరు తరలించడానికి నాలుగు ప్రత్యామ్నా యాలను వాప్కోస్ డీపీఆర్‌లో సూచించింది. బనకచర్ల.. పెన్నా బేసిన్‌లో ఒక భాగమే. కానీ ఆ డీపీఆర్ గురించి ఆనాడు భారాస ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అలా దానికి 2016లోనే పునాది పడింది. అదే ఏడాది జరిగిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనూ గోదావరి జలాల తరలింపునకు అప్పటి సీఎం కేసీఆర్ అంగీకరించారు.

### భారాస కంటే 95 టీఎంసీలు ఎక్కువే అడుగుతున్నాం

కృష్ణా జలాల్లో మేం 500 టీఎంసీలు అడుగుతుంటే భారాస తప్పు పడుతోంది. కానీ రాష్ట్రానికి 299 టీఎంసీలు చాలని 2015 జూన్ 18, 19 తేదీల్లో జరిగిన కృష్ణా నదీ యాజమాన్యమండలి సమావేశంలో లేఖ రాసి ఇచ్చింది అప్పటి నీటిపారుదల మంత్రి హరీశ్‌రావే. 2020 డిసెంబరు 19న జరిగిన మరో కేఆర్ఎంబీ మీటింగ్‌లోనూ కృష్ణా జలాలను ఏపీ, తెలంగాణల మధ్య 66:33 నిష్పత్తిలో పంచుకోవడానికి అంగీకరించారు. 2020 డిసెంబరు 22న జరిగిన ఎపెక్స్ కమిటీ సమావేశంలో.. కేడబ్ల్యూడీటీ-2 తీర్పు నోటిఫై చేసేంతవరకూ కేడబ్ల్యూడీటీ-1 తీర్పు ప్రకారం ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీల మేర పంపిణీ చేయడానికి అంగీకరించింది కూడా కేసీఆరే. అయితే అప్పటివరకు తాము చెప్పింది తప్పని గుర్తించి.. కృష్ణా జలాలను ఏపీ, తెలంగాణల మధ్య 50:50 నిష్పత్తిలో పంపిణీ చేయాలని 2023 జులై 10వ తేదీన హరీశ్‌రావు రాష్ట్ర ఆర్థికమంత్రి హోదాలో కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు లేఖ రాశారు. దాని ప్రకారం.. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన 811 టీఎంసీల్లో 50% అంటే 405.5 టీఎంసీలే. మేం అంతకంటే దాదాపు 95 టీఎంసీలు ఎక్కువగా.. 500 టీఎంసీలు ఇవ్వాలని అడుగుతున్నాం. ఇప్పుడు దీన్ని తప్పుబట్టే వారిని ఏమనాలి? ఈ విషయంలో తీసేసిన తహసీల్దార్లు చేసే విమర్శలను నేను పట్టించుకోను.

### ఆ విషయం వారికే తెలియాలి

తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ అనుమతులు తీసుకుందా? అని కొందరు అడుగుతున్నారు. అది పాత ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టే. కేసీఆర్ దాని డిజైన్ మార్చి కాళేశ్వరం కట్టారు. దానిపై అప్పట్లో ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించారా? లేదా? అన్నది కేసీఆర్, చంద్రబాబునాయుడు, జగన్‌మోహన్‌రెడ్డిలకే తెలియాలి.

### భారాస రుణాన్ని భాజపా తీర్చుకుంటోంది

మోదీకి చంద్రబాబునాయుడు సీట్లు కావాలి. చంద్రబాబు మరోసారి గెలవడానికి బనకచర్ల ప్రాజెక్టు కావాలి. కేసీఆర్ తన పార్టీని బతికించుకోవడానికి ఈ వివాదం కావాలి. గత పార్లమెంటు ఎన్నికల్లో భారాస అవయవదానం మాదిరి.. తన సీట్లు త్యాగం చేసి భాజపాను గెలిపించింది. కేసీఆర్, హరీశ్‌రావులు ప్రాతినిధ్యం వహించే మెదక్ సీటును కూడా కట్టబెట్టింది. ఆ రుణం తీర్చుకోవడానికి ఇప్పుడు కిషన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. అందుకే మేం నిర్వహించిన అఖిలపక్ష ఎంపీల సమావేశానికి రాకుండా దిల్లీ వెళ్లిపోయారు. మాకంటే ఒకరోజు ముందే జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌లను కలిసి మా ప్రయత్నాలకు అడ్డుపుల్లలు వేసేందుకు ప్రయత్నించారు. రాష్ట్రానికి మంచి చేయడం మాని.. ఆయన భారాసను బతికించేందుకు ప్రయత్నిస్తున్నారు. కిషన్‌రెడ్డి ట్యూటర్ కేటీఆరే. కిషన్‌రెడ్డి ఇప్పుడు కేటీఆర్‌కు లైజనింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.

# సన్న వడ్ల బోనస్ కూడా బోగసే

- ఇంకా విడుదల కాని రూ. 1,161 కోట్లు బోనస్ మొత్తం
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు



**హైదరాబాద్, జూన్ 20 :** సన్న వడ్ల బోనస్ కూడా బోగస్ అయింది.. సన్న వడ్ల బోనస్‌పై సన్నాయి నొక్కులేనా అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. యాసంగిలో సన్నాల కొనుగోలు పూర్తయినా రూ. 1,161 కోట్లు బోనస్ ఇంకా విడుదల చేయకపోవడం దుర్మార్గం అని మండిపడ్డారు. 4.01 లక్షల మంది రైతుల నుంచి 23.22 లక్షల టన్నుల సన్నాలు సేకరించిన ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బోనస్ చెల్లించలేదు. రాష్ట్రంలో పొద్దు తిరుగుడు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది. సన్ ఫ్లవర్ కొనుగోలు పూర్తయి 75 రోజులు దాటినా కూడా రైతుల ఖాతాలో డబ్బులు జమ కాకపోవడం రైతుల పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అద్దం పడుతున్నది. ఒక సిద్దిపేట జిల్లాలోనే 50 శాతం రైతులకు డబ్బులు ఇవ్వలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సన్‌ఫ్లవర్ రైతుల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుంది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. పంట కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వేస్తామని ప్రగల్భాలు పలికిన మంత్రి గారు. రెండు నెలలు దాటినా ఇప్పటికీ రైతుల ఖాతాలో డబ్బులు జమ కాకపోవడం శోచనీయం. వెంటనే రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 1,116 కోట్ల సన్నాల బోనస్ డబ్బులతో పాటు సన్ ఫ్లవర్ రైతులకు పంట కొనుగోలు డబ్బులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతులను గోస పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారింది. ప్రతీచోట రైతులు రో÷-డడెక్కే పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల ముందు అబద్ధపు హామీలు, గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన మీరు, పాలన కూడా అదే అబద్దాలతో నడిపిస్తున్నారు. అడుగడుగునా ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం బయటపడుతోంది. రుణమాఫీ 50 శాతం రైతులకి కూడా అందలేదు. పోయిన వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టారు. యాసంగిలో రైతు భరోసా సగం మందికి కూడా ఇవ్వలేదు. ఎన్నికల ముందు 15 వేల రైతు భరోసా అని చెప్పి మాట తప్పి 12,000కి పరిమితం చేశారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా అని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. రైతు కూలీల పరిస్థితి అయితే అధోగతే. ఎన్నికల హామీల్లో అన్ని పంటలకు బోనస్ అని చెప్పి రైతులను మభ్యపెట్టి ఇప్పుడేమో సన్నాలకి పరిమితం చేసి ఆ సన్నాలకు కూడా ఎగనామం పెట్టారు అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా, యాసంగిలో కొనుగోలు చేసిన సన్నాలకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం బోనస్ చెల్లించకపోవడం రైతులను వంచించడమే. ఎంతో కష్టపడి పంట పండించినా, అది ప్రభుత్వ కొనుగోళ్లు లేక దళారుల పాలవుతోంది. కొనుగోలు చేసిన పంటలకు డబ్బులు ఇవ్వకపోవడంతో ప్రభుత్వం రైతులను మరింత దయనీయ స్థితికి నెడుతున్నది. యాసంగిలో బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తే తప్ప కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాని దుస్థితి. ఈ ప్రభుత్వ చేతగానితనం, నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు అని హరీశ్‌రావు మండిపడ్డారు. పంట పెట్టుబడి సహాయం అందించడంలో వైఫల్యం. పండించిన పంటకు గిట్టుబాటు ధర కేటాయించడంలో వైఫల్యం. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో వైఫల్యం. ధాన్యం కొనుగోలు చేయడంలో వైఫల్యం. కొన్న ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో వైఫల్యం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రాష్ట్రంలో కొనుగోలు చేసిన సన్ ఫ్లవర్ పంటకు డబ్బులు విడుదల చేయాలని, అదేవిధంగా సన్నాలకు బోనస్ డబ్బులు కూడా విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# భద్రకాళి అమ్మవారి బోనాలు వాయిదా : మంత్రి సురేఖ

**హైదరాబాద్:** వరంగల్ భద్రకాళి అమ్మవారికి బోనాలు నిర్వహించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. అసాంఘిక శక్తులను ప్రేరేపించి కొందరు గొడవలు సృష్టిస్తారన్న అనుమానంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ మేరకు మంత్రి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. "ఆగమశాస్త్రం ప్రకారం, వేద పండితుల నిర్ణయం మేరకు భద్రకాళి అమ్మవారి ఆలయంలో ఈ నెల 22న బోనాలు నిర్వహించాలని అనుకున్నాం. అయితే, మాంసాహారంతో బోనాలు నిర్వహిస్తున్నట్లు కొందరు చెప్పడంతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లాయి. శాకాహార బోనాలే ఉంటాయన్న విషయాన్ని ప్రభుత్వం, స్థానిక ఈవో, వేదపండితులు పలుమార్లు పునరుద్ఘాటించారు. స్థానిక రాజకీయ వైషమ్యాలను కొందరు పవిత్ర కార్యానికి ముడిపెట్టి ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు సృష్టిస్తారేమోనన్న అనుమానాలున్నాయి. అందుకే బోనాలను తాత్కాలికంగా నిలిపేశాం. తగిన సమయంలో వైభవంగా నిర్వహిస్తాం" అని స్పష్టం చేశారు. సచివాలయంలో తనను కలిసిన విలేకరులతో మంత్రి సురేఖ చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డిలపై విమర్శలు చేశారు. "గోదావరి పుష్కరాల నిర్వహణకు తెలంగాణకు రూ.200 కోట్లు ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాశాం. నిధుల విషయమై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు చొరవ చూపాలి" అని మంత్రి సురేఖ కోరారు. అర్చక, ఉద్యోగ సంక్షేమ నిధి నుంచి 18 మంది ఉద్యోగులకు గ్రాట్యుటీ, వైద్య సహాయం కోసం రూ.32 లక్షల చెక్కును దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం అందించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ డైరెక్టర్ వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# కడియం శ్రీహరిది నల్లికుట్ల వ్యవహారం

- నా మంత్రి పదవి పోతుందని ప్రచారం చేస్తాడా
- టిడిపిలో సాగించుకున్నట్లు ఇక్కడ సాగదు
- నాముందు కూర్చోవాలంటేనే నామోషీగా ఫీలవుతున్నారు
- మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి కొండా సురేఖ విమర్శలు



**వరంగల్, జూన్ 20 :** నా మంత్రి పదవి పోతుందంటూ కడియం శ్రీహరి తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని మంత్రి కొండా సురేఖ మండిపడ్డారు. తన ముందు కూర్చోవడానికి కడియం నామోషీగా ఫీలవుతున్నారని అన్నారు. మీడియాతో ఆమె ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. పలు అంశాలపై స్పందించారు. కడియం శ్రీహరిపై విమర్శలు గుప్పించారు. ఈసందర్భంగా ఉమ్మడి వరంగల్‌లోని కాంగ్రెస్ కీలక నేతలపై మంత్రి కొండా సురేఖ హాట్ కామెంట్స్ చేశారు. స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నల్లికుట్ల మనిషి అని ఆరోపించింది. నేను మంత్రిగా ఉంటే నా ముందు కూర్చోవడానికి నామోషీగా ఫీల్ అవుతున్నాడని పేర్కొనింది. అందుకే నా మంత్రి పదవి పోతుందంటూ తప్పుడు ప్రచారం చేపిస్తున్నాడు అని తెలిపారు. ముఖ్యమంత్రి దగ్గరకు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దగ్గరకు వెళ్లి నా మీద ఉన్నది లేనిది చెబుతున్నాడని చెప్పుకొచ్చారు. తెలుగు దేశం పార్టీలో నడిపించుకున్నట్లు.. ఇక్కడ కూడా నడిపించాలని అనుకుంటున్నాడు అని మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. అయితే, నా అదృష్టం ఉంది నేను మంత్రి అయ్యాను.. ఆయనకు అదృష్టం ఉన్నప్పుడు ఆయన కూడా మంత్రి అయ్యాడని కొండా సురేఖ తెలిపారు. నా కూతురికి అదృష్టం లేదు ఎమ్మెల్యే కాలేదు.. కడియం కూతురికి అదృష్టం ఉంది ఎంపీ అయ్యింది.. నేను ఆమె ఎంపీ పదవి తీయాలని అంటున్నానా అని అడిగారు. అలాగే, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిపై ఆమె తీవ్రంగా మండిపడింది. భద్రకాళీ టెంపుల్ ఎవరి సొత్తు కాదు.. కొందరు తమ సొత్తు అన్నట్లు ఫీల్ అవుతున్నారు.. నాయిని రాజేందర్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడడం సరికాదు.. ఆయన అభివృద్ధిని అడ్డుకుంటున్నారు.. ఆగమశాస్త్రం ప్రకారమే భద్రకాళి అమ్మవారికి బోనం సమర్పించాలని నిర్ణయం తీసుకున్నామని వెల్లడించింది. అక్కడ యాటలు కోస్తారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు.. అమ్మవారు శాఖాహారి అని అందరికీ తెలుసు.. అక్కడ ఏళ్లుగా పని చేస్తున్న పూజార్ల అభిప్రాయం తీసుకున్నాం.. బల్కంపేట దేవాలయం నుంచి బోనం తీసుకువెళ్లి భద్రకాళి అమ్మవారికి సమర్పిస్తామని మంత్రి కొండా సురేఖ వెల్లడించించారు. అయితే ఈనెల 22న జరగాల్సిన భద్రకాళీ అమ్మవారి బోనాలను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించాం. కొందరి అభ్యంతరాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నాం. అసాంఘిక శక్తులతో గొడవలు సృష్టిస్తారనే అనుమానం ఉంది. మాంసాహారంతో బోనాలు చేస్తారని కొందరు తప్పుడు సంకేతాలు తీసుకెళ్లారు. భద్రకాళీ బోనాల నిర్వహణపై సంప్రదింపుల తర్వాత కార్యచరణ ప్రకటిస్తాం. ఆగమశాస్త్రం ప్రకారమే భద్రకాళీ అమ్మవారికి బోనం సమర్పిస్తాం. గోదావరి పుష్కరాల విషయంలో కేంద్రం తెలుగు రాష్ట్రాలను సమంగా చూడాలి. తెలంగాణపై వివక్ష చూపొద్దు. గోదావరి పుష్కరాలకు రూ. 200 కోట్లు ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాశాం. భద్రాచల రాముడి పాదాల నుంచే గోదావరి ప్రవహిస్తుంది. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చొరవ చూపి.. పుష్కరాల కోసం నిధులు ఇప్పించాలి'అని మంత్రి కొండా సురేఖ కోరారు.

# నాటి డీజీపీ చెబితేనే ట్యాపింగ్ చేశా..

## సిట్ విచారణలో ప్రభాకర్‌రావు కొత్త పల్లవి



**హైదరాబాద్:** ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో నాలుగు విడతలుగా పొంతన లేని సమాధానాలు చెబుతూ వచ్చిన ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు తాజాగా కొత్త పల్లవి అందుకున్నట్లు కనిపిస్తోంది. అయిదో విడతగా శుక్రవారం ఆయన్ని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారించింది. తనకు నాటి డీజీపీ చెబితేనే అప్పట్లో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డానని, నాటి ప్రభుత్వ పెద్దలెవరూ తనకు ఈ విషయంలో ఆదేశాలు ఇవ్వలేదని ప్రత్యేక దర్యాప్తు బృందానికి(సిట్) తాజాగా వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. అప్పట్లో ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారాలను పర్యవేక్షించిన ఇతర నిందితులు ప్రణీత్‌రావు, భుజంగరావు, రాధాకిషన్‌రావు, తిరుపతన్న అంతా ప్రభాకర్‌రావు చెప్పినట్లే పనిచేశామని ఇప్పటికే సిట్‌కు వాంగ్మూలమిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వారికి ఎందుకు ఆదేశాలు ఇచ్చారనే కోణంలో సిట్ ప్రస్తుతం ప్రభాకర్‌రావును ప్రశ్నిస్తోంది. మొదట మావోయిస్టులకు సహకరించినందుకే కొందరి ఫోన్లు ట్యాపింగ్ చేయాల్సి వచ్చిందని చెబుతూ వచ్చారు. అందుకు ఆధారాలు చూపాలని సిట్ ప్రశ్నించడంతో ప్రస్తుతం ఉన్నతాధికారుల వైపు వేలెత్తి చూపినట్లు తెలిసింది. అయితే ప్రభాకర్‌రావు కేసు నుంచి తప్పించుకునేందుకే ఇలాంటి ఎత్తుగడలకు పాల్పడుతున్నారని సిట్ అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఏపీఎస్‌ఆర్టీసీ మాజీ ఛైర్మన్ గోనె ప్రకాశ్‌రావు శుక్రవారం సిట్ అధికారుల ఎదుట హాజరై వాంగ్మూలమిచ్చారు.



# గ్రూప్-1 అభ్యర్థుల పోరాటానికి అండగా ఉంటా

## : బండి సంజయ్

**కరీంనగర్ :** గ్రూప్-1 పరీక్షలో జరిగిన అక్రమాలపై అభ్యర్థులు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటానని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చిన పలువురు గ్రూప్-1 అభ్యర్థులు శుక్రవారం సాయంత్రం కరీంనగర్‌లో ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిశారు. గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు జరిగాయని మంత్రికి తెలిపారు. ఉర్దూ మాధ్యమంలో మెటీరియల్ అందుబాటులో లేనప్పటికీ ఆ మీడియంలో పరీక్షలు రాసినవారిలో ఎక్కువ మందిని అర్హులుగా ప్రకటించారన్నారు. ఒకే కేంద్రంలో పరీక్ష రాసినవారే ఎక్కువగా అర్హత సాధించడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ విషయంపై తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, అండగా నిలవాలని కోరారు. సంజయ్ స్పందిస్తూ.. కష్టపడి చదువుకున్న అభ్యర్థులు మాత్రమే ఉద్యోగాలకు అర్హులన్నారు. అక్రమాలకు తావివ్వకుండా పరీక్షలు నిర్వహించాలన్నదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్ల విద్యా వ్యాపారం

- తడిసి మోపెడవుతున్న చదువు భారం
- పుస్తకాలు కావాలంటే జేబు గుల్ల
- కొరవడిన విద్యాశాఖ పర్యవేక్షణ




**నిజామాబాద్, జూన్ 20 :** ప్రైవేటు పాఠశాలల తీరుపై విద్యాశాఖ అధికారుల్లో పూర్తిగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. కనీస వసతులు కరవైనా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. అనుమతులు సహా ఇతర వ్యవహారాల్లోనూ పర్యవేక్షణ కొనసాగించడం లేదు. కమిషన్లతో వ్యాపారం .. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఆయా పుస్తక విక్రయ దుకాణాలతో ముందస్తు ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్నాయి. కొన్ని ప్రైవేటు బడుల్లో ఫీజులుం కొనసాగుతోంది. ఫీజుల విషయంలో ఇప్పటికే విద్యార్థి సంఘాలు పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వాటి నియంత్రణ దిశగా కనీస చర్యలకు చేపట్టలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బడి ఆవరణలో ఎట్టిపరిస్థితుల్లో విద్యను వ్యాపారం చేసేలా పుస్తకాలు, ఏకరూప దుస్తులను విక్రయించవద్దనే నిబంధనను ఉల్లంఘిస్తున్నా..చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. వసతులు, సౌకర్యాలు ఎలా ఉన్నా నాణ్యమైన విద్య ముసుగులో అక్రమార్జనకు కొన్ని పాఠశాలలు తెరతీస్తున్నాయి. బడుల్లో పుస్తకాలు, ఏకరూప దుస్తులను విక్రయించవద్దని.. ప్రభుత్వం, న్యాయస్థానం ఆదేశించినా జిల్లాలో ఆ వ్యవహారం బాహాటంగానే సాగుతోంది. కాసుల కక్కుర్తితో బడిలో వ్యాపారం నడుస్తోంది.

### పుస్తకాలు కావాలంటే జేబు గుల్ల

తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వారు చెప్పిన ఫీజును కాదనలేక.. పుస్తకాలను మరో చోట కొనలేక నానాతంటాలు పడుతున్నారు. ఎల్‌కేజీ విద్యార్థి పుస్తకాలకే రెండువేల వరకు ఖర్చవుతోంది. ఇక కెజీ పెరిగిన కొద్దీ రకరకాల పుస్తకాలు కావాలంటే జేబు గుల్లకాక తప్పడంలేదు. వీటికితోడుగా రాత కోసం మరో 10 నోటు పుస్తకాలను కొనాల్సిందే. బడికి బస్సులోనే పంపాలి. ఇందుకోసం నెలకు రవాణా రుసుం కట్టాలి. పుస్తకాలకు డ్రెస్‌లకు మరో రెండు వేలు, బెల్టు, బ్యాగు, బూట్లు ఇతర నోటు పుస్తకాలకు మరో మూడువేలు వసూల చేస్తున్నారు. పిల్లలుఫలానా షాపులోనే ఇవన్నీ కొనే విధంగా రహస్య ఒప్పందాలు కొందరు కుదుర్చుకున్నట్లు సమాచారం. పుస్తక దుకాణాల వారే అధికంగా అన్ని పాఠశాలలతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఒక్కో పాఠశాల నుంచి సుమారు 400 నుంచి 1200 మంది పిల్లలు ఉంటున్నారు. ఇలా వారి సంఖ్యను బట్టి బడులకు కమిషన్ అందిస్తున్నట్లు తెలుస్తోంది.

### ఒక్కో బడిలో ఒక్కో విధమైన ధర

పిల్లలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలన్నీ అక్కడే కొనాలే నిబంధనను పెడుతున్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వారి చెప్పిన ధరలకే తీసుకోవాల్సి వస్తోంది. ఇలా జిల్లా వ్యాప్తంగా కొన్ని విద్యాసంస్థలు కోట్ల రూపాయల్లో లావాదేవీలు చేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ఒక్కో బడిలో ఒక్కో విధమైన ధరల్ని నిర్ణయించారు. తరగతుల వారీగా పాఠ్యపుస్తకాలతోపాటుగా నోటు పుస్తకాలను అమ్ముతున్నారు. ఏ ఒక్కటి తీసుకోకున్నా ఒప్పుకోవడం లేదు. సట్టణంలో ఒకటి రెండు బడులకు మినహాయిస్తే ఏ ఒక్క చోట విద్యార్థులు ఆడుకునేందుకు మైదానాలు లేవు. పైగా విద్యార్థులకు క్రీడల కోసం కొన్ని చోట్ల ప్రత్యేక ఫీజు వసూలు చేస్తున్నారు. మైదానం సంగతేంటని.. తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారంలో ఒక రోజు పట్టణశివారులో ఉన్న మైదానానికి పిల్లలను బస్సులో తీసుకెళ్తామనే సమాధానాలు వినిపిస్తున్నాయి.

## నగరంలోని పారామౌంట్ కాలనీలో
# పోలీసులు కార్డన్ సెర్చ్

- వీసా గడువు ముగిసినా ఇక్కడే తిష్టవేసిన విదేశీయులు
- 18మంది అక్రమంగా ఉంటున్నట్లు గుర్తించిన పోలీసులు
- వారిని డిపోర్ట్ చేస్తామని ప్రకటించిన సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ

**హైదరాబాద్, జూన్ 20 :** హైదరాబాద్ నగరంలోని పారామౌంట్ కాలనీలో శుక్రవారం తెల్లవారు జామున పెద్దఎత్తున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించడంతో ఉద్రిక్తత నెలకొంది. అక్రమ చట్టవ్యతిరేక కార్యకలాపాలు, విదేశీయుల అక్రమ నివాసాలపై ఆధారంగా పోలీసులు ఈ ఆపరేషన్ చేపట్టారు. సుమారు 150 మంది పోలీసులు తెల్లవారుజాము 3 గంటల సమయంలో ఈ కాలనీని చుట్టు ముట్టి సోదాలు ప్రారంభించారు. లా అండ్ ఆర్డర్, టాస్క్ ఫోర్స్, హెచ్ఎన్ యూ, ఏఆర్ విభాగాలకు చెందిన పోలీసులు ఈ తనిఖీలలో పాల్గొన్నారు. ఈ సెర్చ్‌లో నైజీరియా, ఇథియోపియా, కెన్యా, సోమాలియా దేశాలకు చెందిన వలసదారులు పెద్దఎత్తున ఉన్నట్లు గుర్తించారు. వీరిలో చాలామంది భారతదేశం వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమంగా నివసిస్తూ ఇల్లీగల్ కార్యకలాపాల్లో భాగం అవుతున్నట్లు పోలీసుల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తనిఖీల్లో మొత్తం 18 మంది విదేశీయులు వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమంగా జీవిస్తున్నట్లు గుర్తించారు. వారిని గుర్తించిన పోలీసులు త్వరలోనే డిపోర్ట్ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సోదాల సందర్భంగా డాక్యుమెంట్లు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 50కి పైగా బైకులు, 5 కార్లను పోలీసులు సీజ్ చేశారు. అంతేకాక, గుట్టుచప్పుడు కాకుండా నడిపిస్తున్న బెల్ట్ షాపులు, హుక్కా సెంటర్లను గుర్తించి పెద్ద ఎత్తున మద్యం బాటిళ్లు, గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. మద్యం అక్రమ నిల్వలు బయటపడటంతో, స్థానికంగా నడుస్తున్న చట్టవ్యతిరేక కార్యకలాపాలపై మరింత దృష్టి పెట్టనుని పోలీసులు అన్నారు. ఈ సందర్భంగా సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ మాట్లాడుతూ, 'పారా మౌంట్ కాలనీలో కార్డన్ సెర్చ్‌తో పాటు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించాం. వీసా గడువు ముగిసినా ఇక్కడే ఉండిపోయిన విదేశీయులను గుర్తించాం. వారి వివరాలు సేకరించి, త్వరలోనే డిపోర్ట్ చేయనున్నాం. మాదక ద్రవ్యాల విషయంలో మేము చాలా సీరియస్‌గా ఉన్నాం. ఈ సెర్చ్‌లో డ్రగ్స్ లభించలేదు. కానీ భవిష్యత్‌లో ఇలాంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుం టాం' అని తెలిపారు. ఈ కార్డన్ సెర్చ్‌తో నగరంలోని ఇతర అనుమానస్పద ప్రాంతాల్లో కూడా ఇలాంటి తనిఖీలు జరపనున్నట్లు పోలీసులు సంకేతాలు ఇస్తున్నారు. విదేశీయుల పేరుతో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై పూర్తిస్థాయిలో పట్టు సాధించేందుకు ఇది ఒక ముందడుగుగా మారింది.




## బ్యాంకింగ్ వ్యవస్థలోనే
# లోపాలున్నాయి

- ఛార్జీల పేరుతో సామాన్యులపై భారం వేస్తున్నారు
- రూ.వేల కోట్లు ఎగవేసిన వారిని వదిలేస్తున్నారు
- బ్యాంకు అధికారుల తీరుపై హైకోర్టు వ్యాఖ్యలు

**హైదరాబాద్:** దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థలో లోపాలున్నాయని ఓ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు వ్యాఖ్యానించింది. బ్యాంకు అధికారులు వేల కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేస్తున్నారని, తీసుకున్న వారు ఎగవేస్తుంటే పట్టించుకోవడంలేదని, అదే సమయంలో సామాన్యులపై వివిధ ఛార్జీల పేరుతో భారం మోపుతున్నారని ఆక్షేపించింది. మంజూరుచేసిన అధికారులపైనే వసూలు చేయాల్సిన బాధ్యత పెడితే.. వ్యవస్థలో కొంతయినా మార్పు వస్తుందని పేర్కొంది. హైదరాబాద్ సనత్‌నగర్ ఎస్‌బీఐ బ్రాంచి అధికారులు ముందస్తు చెల్లింపుల పేరుతో, ఎలాంటి సమాచారం లేకుండా ఛార్జీలను మినహాయించుకోవడాన్ని సవాలుచేస్తూ ఉత్తమ్ ధాతు అండ్ ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఆస్తులను హామీగా ఉంచి తీసుకున్న రుణాన్ని ముందుగానే చెల్లించినందుకుగాను రూ.1.16 కోట్లు కంపెనీ ఖాతా నుంచి బ్యాంకు మినహాయించుకుందన్నారు. ఇది ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధమని, జరిమానాతోపాటు వడ్డీతో సహా తిరిగి ఇచ్చేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి బ్యాంకింగ్ వ్యవస్థ లోపభూయిష్ఠంగా ఉందని పేర్కొంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'సాధారణ, మధ్య తరగతి ప్రజలు రుణాలు తీసుకుంటే ఛార్జీల పేరుతో బ్యాంకులు భారం వేస్తున్నాయి. రుణం ముందు తీర్చేసినా, జాప్యం చేసినా జరిమానాల పేరుతో సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. తీసుకున్న గృహరుణం పూర్తయిన తర్వాత.. సంబంధిత డాక్యుమెంట్ తీసుకునేటప్పుడు కూడా ఛార్జీలు చెల్లించాల్సి వస్తోంది. అదే సమయంలో రూ.వేల కోట్ల రుణం తీసుకుని ఎగవేసిన వారి నుంచి వసూలు చేయలేకపోతున్నాయి. మంజూరు చేసిన బ్యాంకు అధికారే వసూలు బాధ్యత కూడా తీసుకోవాలనే నిబంధన ఉంటే రుణాలు సక్రమంగా మంజూరవుతాయి' అని న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రస్తుత కేసులో ఆర్‌బీఐతోపాటు బ్యాంకు అధికారుల వివరణను పరిశీలించాల్సి ఉందన్నారు. ప్రతివాదులైన ఆర్‌బీఐతోపాటు ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీలకు నోటీసులు జారీ చేస్తూ..కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

## ఐదు రోజుల్లో
# రూ.7,310.59 కోట్లు విడుదల

### ఏడెకరాల వరకు న్న వారికి నిధులు జమ

**హైదరాబాద్, జూన్ 20 :** రాష్ట్రంలో రైతుభరోసా పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం నిధుల జమ కొనసాగుతోంది. ఏడెకరాల వరకు ఉన్న వారికి శుక్రవారం నిధులు జమ అయ్యాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులకు పెట్టుబడి సాయం అందుతోంది. ఐదో రోజు శుక్రవారం 7 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు జమ అయ్యాయి. అందుకోసం ప్రభుత్వం మరో రూ.905.89 కోట్లు విడుదల చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కేవలం ఐదు రోజుల్లో రూ.7,310.59 కోట్లు విడుదల చేశామని వెల్లడించారు. ఇప్పటి వరకు 65.12లక్షల మంది రైతులకు రైతు భరోసా సాయం అందిందన్నారు. విస్తీర్ణంతో సంబంధం లేకుండా సాగుభూమికి సాయం అందజేస్తామని స్పష్టం చేశారు.

# కేసీఆర్‌ను విలన్ చేసే యత్నంలో హరీష్

- నీళ్లతో రాజకీయం చేసిన పార్టీ బిఆర్ఎస్
- జగన్‌తో కుమ్మక్కయి కృష్ణ జలాలకు తిలోదకాలు
- భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్



**హైదరాబాద్, జూన్ 20 :** బీఆర్ఎస్ నేత హరీష్ రావు వాళ్ల మామ.. మాజీ సీఎం కేసీఆర్‌ను విలన్ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ ఆరోపించారు. నీళ్ళు అనే పదంతో బీఆర్ఎస్ రాజకీయం చేసిందని, బీఆర్ఎస్ నేతలు బేసిక్ నాలెడ్జ్‌తో ప్రాజెక్టులు కడితే బాగుండేదని అన్నారు. కాళేశ్వరం కూలిన తర్వాత తెలంగాణ ప్రజలకు నీళ్ల సంగతి పూర్తిగా అర్థమైందని, 2016 సీడ్ల్యూసీ మీటింగ్‌లో కేసీఆర్ ఏం మాట్లాడారో చెప్పాలన్నారు. కేసీఆర్‌కు ఉన్న అపరజ్ఞానం వల్లే కాళేశ్వరం కూలేశ్వరం అయిందని విమర్శించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డితో నాలుగు సార్లు మంతనాలు జరిపి తెలంగాణ నీళ్లకు అన్యాయం చేసింది కేసీఆర్ అని, హరీష్ రావు వైఖరి వల్లే ఏపీ నేతలు బనకచర్లకు నీళ్ళు తరలించుకుందామనే ఆలోచన చేశారని చామల కిరణ్ అన్నారు. గోదావరి జలాలపై గొంతు చించుకునే బీఆర్ఎస్ నేతలు.. కృష్ణా జలాలపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. హరీష్ రావుకు కంటెంట్ కంటే ఎక్కువ ఆవేశమే ఉందని, బీఆర్ఎస్ నేతలు సీఎం కుర్చీలో రేవంత్ రెడ్డిని చూడలేక పోతున్నారని అన్నారు. నదీ జలాలు ఎవరి అయ్యా జాగీరు కాదని హరీష్ రావు తెలుసుకోవాలన్నారు. నీళ్ళ అంశంపై తనకు, కేసీఆర్‌కు తప్పా ఎవరికీ ఏం తెలియదని హరీష్ అనుకుంటున్నారని, తెలంగాణ నీటిని ఏపీకి ధారాదత్తం చేసిందే కేసీఆర్ అని చామల కిరణ్ ఆరోపించారు. హరీష్ రావు ఇరిగేషన్ మంత్రిగా ఉన్నప్పుడే ఈ పంచాయితీ మొదలైందన్నారు. బనకచర్ల విషయంలో కేంద్రం వినకపోతే సుప్రీంకోర్టు మెట్లు ఎక్కుతామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి కమిట్‌మెంట్ అర్థం చేసుకోవచ్చునని అన్నారు. బనకచర్లపై ఏకగ్రీవ తీర్మాణం చేద్దామని అనుకునే సమయానికి ఆల్ పార్టీ మీటింగ్ నుండి బీఆర్ఎస్ ఎంపీ వాకౌట్ చేసారన్నారు. బేస్ వదిలి దోచుకునే ప్రయత్నం చేశారు కాబట్టే తెలంగాణ ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారన్నారు. బేసిక్స్ కాదు తమకు ఎథిక్స్ ఉన్నాయి కాబట్టే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని ఎంపీ చామల కిరణ్ అన్నారు.

# పోలవరంతో భద్రాచలం మునక

- రాముడు తెలంగాణలో.. భూములు ఎపిలో
- ఎపిలో కలిపిన ఐదూళ్లు వెంటనే వెనక్కి ఇచ్చేయాలి
- తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత డిమాండ్



**హైదరాబాద్, జూన్ 20 :** పోలవరం నిర్మాణంతో భద్రాచలం పూర్తిగా మునిగిపోవడం ఖాయమని, అందుకే తాము పోలవరం ప్రాజెక్టు నిర్వహణ అంశాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే వ్యతిరేకించామని భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. అప్పట్లో తాము సుప్రీంకోర్టుకు వెళ్లి ఆపే ప్రయత్నం చేసినా ప్రాజెక్టు ఆగలేదని తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణకు ముంపుపై శుక్రవారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన గ్రామాల్లో ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలని, పురుషోత్తపట్నం, గుండాల, ఎట్టపాక, కన్నాయగూడెం, పిచ్చుకలపాక గ్రామాలు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆమె అన్నారు. పోలవరం వల్ల భద్రాచలం ప్రాంతానికి శాశ్వత ముంపు ఏర్పడిందన్నారు.

### రాముడు తెలంగాణలో.. భూములు ఎపిలో

ఏపీలో కలిపిన పురుషోత్తపట్నంలో భద్రాచలం రాములవారి మాన్యం వెయ్యి ఎకరాలు ఉందని, ఆ వెయ్యి ఎకరాల దేవుడి మాన్యం ఆంధ్రాకు పోయిందన్నారు. దేవుడేమో తెలంగా ణలో ఉన్నాడని.. అక్కడ పట్టించుకునే పరిస్థితి లేక దేవుడి మాన్యం అన్యాక్రాంత మవుతోందన్నారు. దేవుడి మాన్యాన్ని పరిరక్షించాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. పోలవరం ముంపుపై సంయుక్త సర్వే నిర్వహించాలని కవిత అన్నారు. ఈ నెల 25న ప్రగతి ఎజెండా పేరిట ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్ గడ్ సీఎంలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న సమావేశంలో ఈ అంశాన్ని చర్చించాలని, ఐదు గ్రామా లను వెనక్కి తీసుకొచ్చేలా సీఎం రేవంత్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడి చేయా లని కవిత అన్నారు. కరకట్టల ఎత్తు పెంచుకుంటేనే భవిష్యత్తులో కూడా ఐదు గ్రామాలకు రక్షణ ఉంటుం దని అభిప్రాయం వ్యక్తం చేశారు. లేదంటే ఎప్పుడైనా భారీ వరదలు వస్తే అన్ని గ్రామాలు మునిగిపోతాయ న్నారు. అవస రమైతే న్యాయ పోరాటం చేస్తామని కవిత అన్నారు.

### తెలంగాణకు అన్యాయం

ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టును ఆపే ప్రయత్నంలో తెలంగాణ జాగృతి సుప్రీం కోర్టును ఆశ్రయించిందన్నారు. 2014లో ప్రధాని మోదీ మొట్టమొదటి క్యాబినెట్ సమావేశంలో ఏడు మండలాల ను ఏపీలో కలపడానికి ఆర్డినెన్స్‌ను ఆమోదించి తెలంగాణకు అన్యాయం చేశారని విమర్శించారు. ఆ ఏడు మండలాలను అన్యాయంగా ఏపీలో కలిపారన్నారు. లోయర్ సిలేరు విద్యుత్తు ప్రాజెక్టును కూడా ఏపీకి అప్పజెప్పారని... బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేసి చంద్రబాబు ఏడు మండలాలను తీసుకున్నారని విమర్శించారు. ఇది విభజన చట్టానికి, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని అప్పుడే పార్లమెంటులో మేము గళమెత్తామన్నారు. కేసీఆర్ బంద్‌కు పిలుపునిచ్చినా కేంద్రానికి చీమకుట్టినట్టుగా లేదన్నారు. పోలవరం స్పిల్ వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచుకోవడం వల్ల తెలంగాణకు బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడుతుందని, భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదంలో ఉందని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు సామర్థ్యం 36లక్షల క్యూసెక్కుల నుంచి 50లక్షల క్యూసెక్కులకు పెంచుకుంటూ పోవడంతో ముంపు పెరిగిపోతోంది. మానవీయ కోణంలో ఆలోచించి పరిష్కారం చేయాల్సిన అవసరముంది. పురుషోత్తమపట్నం, గుండాల, ఎటపాక, కన్నాయిగూడెం, పిచుకులపాడు గ్రామపంచాయతీ లను వెనక్కి ఇవ్వాలి. ఈ నెల 25న ప్రగతి ఎజెండా పేరిట 4 రాష్ట్రాల సీఎంలతో ప్రధానమంత్రి మోదీ నిర్వహిస్తున్న సమావేశంలో ఆ ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణకు ఇస్తున్నట్లు ప్రకటించాలని కవిత డిమాండ్ చేశారు.

# రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం కొనసాగింపు

### 23వ తేదీ నుంచి ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరణ

**హైదరాబాద్, జూన్ 20 :** సింగరేణి కాలరీస్ సామాజిక బాధ్యతతో చేపట్టిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. ఈ మేరకు ఈ నెల 23వ తేదీ నుంచి ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల విడుదలై సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం కింద ఒక్కొక్కరికి లక్ష రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైన సింగరేణి కార్మికుల పిల్లలకు కూడా రూ.లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం అందించనున్నట్లు వెల్లడించారు. దేశంలోనే ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ పరీక్షకు సన్నద్ధమవుతున్న తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు ఆర్థిక ప్రతిబంధకాలను తొలగించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సూచనతో సింగరేణి సామాజిక బాధ్యత నిధులతో గత ఏడాది ప్రారంభించిన ఈ పథకం మంచి ఫలితాన్ని ఇచ్చినట్లు ఆయన తెలిపారు. గత ఏడాది 140 మంది ప్రిలిమ్స్ పాసైన వారికి సాయం అందించగా 20 మంది మెయిన్స్ లోనూ ఉత్తీర్ణత సాధించి ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని, ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారికి మరో లక్ష రూపాయల సాయం కూడా అందించామని, వారిలో ఏడుగురు సివిల్స్ లో సత్తా చాటారని వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో ఈ ఏడాది కూడా మరింత మందికి ప్రోత్సాహం అందించేందుకు దీన్ని కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు సింగరేణి వెబ్ సైట్ ను సందర్శించి ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సివిల్స్ మెయిన్స్ పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులకు ఇది ఒక గొప్ప అవకాశమని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.




# ఆరోగ్య ప్రదాయిని యోగా

- 24 గంటల కౌంట్‌డౌన్ వేడుకల్లో వక్తలు
- ఎల్బీ స్టేడియంలో అట్టహాసంగా నిర్వహణ

**హైదరాబాద్:** ఆరోగ్యంగా ఆనందమయ జీవితం గడపడానికి యోగా ఎంతో దోహదం చేస్తుందని వక్తలు తెలిపారు. ప్రపంచానికి భారత్ అందించిన గొప్ప వరం యోగా అని, ప్రధాని మోదీ చొరవతో అన్ని దేశాలు యోగా దినోత్సవాన్ని జరుపు కొంటున్నాయని పేర్కొన్నారు. ఒత్తిడి, ఆందోళనతో సతమ తమవుతోన్న ప్రస్తుత యువత వారి దినచర్యలో దీన్ని భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఒకరోజు ముందుగా '24 గంటల కౌంట్‌డౌన్ వేడుకలు' పేరుతో శుక్రవారం ఉదయం యోగా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీ ఈటల రాజేందర్, సినీ నటి, భాజపా నేత కుష్బు, నటీనటులు మీనాక్షిచౌదరి, సాయిదుర్గాతేజ్, తేజ సజ్జా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ 'యోగాతో యోగ్యులవుతారు. మానసికంగా, శారీరకంగా సమతుల్యం సాధిస్తారు. ప్రస్తుతం ఎంతోమంది పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. అన్ని సమస్యలకు ఇది పరిష్కారంగా పనిచేస్తుంది. దీనికి ప్రత్యేకంగా జాతి, మతం లేదు. ఒక్కరోజు కార్యక్రమంలా కాకుండా జీవితంలో భాగం చేసుకోవాలి' అని సూచించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ 'యోగా అంటే శారీరక వ్యాయామం మాత్రమే కాదు. అదొక జీవన ప్రమాణం. శాంతి, క్రమశిక్షణతో కూడిన జీవనానికి యోగా ఎంతో అవసరం. శరీరం, మనసు, ఆత్మను అనుసంధానం చేసే అద్భుత సాధనం. భారత్‌లో పుట్టిన యోగా.. సరిహద్దులు, సంస్కృతి, సంప్రదాయాలను దాటి ఇప్పుడు విశ్వవ్యాప్తమైంది' అని తెలిపారు.

# వరంగల్ కోర్టుకు బాబు బెదరింపు

### ముమ్మర తనిఖీలు చేపట్టిన పోలీసులు

**హనుమకొండ, జూన్ 20 :** వరంగల్ కోర్ట్ ప్రాంగణంలో బాంబు పెట్టినట్లు ఓ ఆగంతకుడు పోలీసులకు ఫోన్ చేసి బెదిరించాడు. ఈ సంఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. డయల్100 నెంబర్‌కి ఫోన్ చేసి చెప్పడంతో పోలీసులు వెంటనే అప్రమత్తం అయ్యారు. కోర్టు ప్రాంగణంలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో కోర్టు ప్రాంగణంలో పెట్టిన ఆరు డిటోనేటర్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సకాలంలో పోలీసుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. కోర్ట్ పరిసరా ప్రాంతాలను పోలీసులు బాంబ్ స్క్వాడ్ సహాయంతో పరిశీలిస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజలను కోర్టు ప్రాంగణం నుంచి దూరంగా పంపించి వేశారు. ఫోన్ ఎక్కడ నుంచి వచ్చింది.. ఎవరు చేశారనే విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. కోర్టు ప్రాంగణం మొత్తం ఆధీనంలోకి తీసుకుని జల్లెడ పట్టారు. ఈ క్రమంలోనే కోర్టు ఆవరణలో భద్రపరిచిన 6 డిటోనేటర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ డిటోనేటర్లను ఆత్మకూరుకు చెందిన ఓ కేసు విషయంలో గతంలో స్వాధీనం చేసుకున్నవిగా గుర్తించారు. డిటోనేటర్లకు సంబంధించిన కేసు ఎప్పుడు కొట్టివేసినట్లు పోలీసులు వెల్లడించారు. తాజా బాంబ్ బెదిరింపు కాల్‌కు ఈ డిటోనేటర్లకు ఎలాంటి సంబంధం లేదని పోలీసులు, కోర్టు సిబ్బంది పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. బెదిరింపు కాల్ చేసిన అజ్ఞాత వ్యక్తి కోసం గాలిస్తున్నారు. బాంబ్ బెదిరింపు కాల్‌తో జిల్లా కోర్టుకు వచ్చిన వారు భయాందోళనకు గురయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన చోటుచేసుకోకుండా కోర్టు వద్ద భారీగా పోలీసులను మోహరించారు.

# ఆరోగ్య ప్రదాయిని యోగా!



నవ్వించడం యోగం..నవ్వకపోవడం రోగం అన్నారు. నవ్వుకూడా ఓ ఆరోగ్య ప్రక్రియ అని అందరూ తెలుసుకోవాలి. ఇకపోతే యోగా అన్నది భారతీయ జీవన విధానంలో ఉన్న ప్రాచీన ప్రక్రియ. ఇది శాస్త్రీయంగా రుజువు చేయబడింది. యోగాను పరిచయం చేసిన మనదేశం..ఇప్పుడు అంతర్జాతీయ యోగాను కూడా జరుపుకునేలా చేసింది. మనావులు ఎక్కడ ఉన్నా, ఏ స్థితితలో ఉన్నా యోగా వల్ల అనేకానేక రుగ్మతలను నిర్మూలించవచ్చు. యోగాతో శరీరం క్రమపద్ధతిలో మార్పు చెందడమే గాకుండా, జీర్ణప్రక్రియయతో పాటు, నాడీ వ్యవస్థను అదుపులో ఉంచుతుంది.. ఓ రకంగా చెప్పాలంటే యోగా అలవర్చుకున్న వారికి వారి శరీరం చెప్పినట్లుగా నడుచుకుంటుంది. విజ్ఞానశాస్త్ర ప్రకారం యోగా అంటేపరిపూర్ణ జీవనసార విధానం. భారతదేశం చేసిన ప్రయత్నంతో ఐక్యరాజ్యసమితి జూన్ 21న అంతర్జాతీయ యోగగా దినోత్సవంగా గుర్తించింది. దీంతో యోగాకు ప్రాధాన్యంతో పాటు, అంతర్జాతీ యంగా దీనిని ఆచరించే వారి సంఖ్య పెరిగింది. యోగా అనేది 5వేల సంవత్సరాల నుండి భారతదేశంలో ఉన్న జ్ఞానం యొక్కఅంతర్భాగంగా గుర్తించారు. యోగా చేస్తున్న వారిలో మానసిక, ఆరోగ్య సమస్యలు ఉండవని నిరూపితం అయ్యింది. నిత్యం యోగా చేసిన వారు ఆనందంగాను, ఉత్సాహంగానూ ఉండడాన్ని గమనించ వచ్చు. ఖయోగ సూత్రాలను సరళంగా, వివరంగా, అందరికి అందుబాటులోనికి తీసుకురావటమే లక్ష్యంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అత్యంత లాభాన్ని నిజజీవితంలో ఎలా అనుభవించగలం అన్న అంశం మీద ఇది కేంద్రీకృతమై ఉంటుంది. ఆరోగ్య సమస్యలు గాని, భావావేశాలు గాని, వ్యక్తిగత జీవితం పైన ప్రభావాన్ని చూపుతుంటాయి. అలాంటి వారు యోగా సాధన ద్వారా ఉపశమనం పొందవచ్చని నిరూపింతం అయ్యింది.

జీవన సరళిలో చిన్న చిన్న మార్పులతో సమస్యలని సహజంగానే అధిగామించడం సాధ్యమనికూడా తెలుసుకోవచ్చు. నిత్యం యోగా చేస్తూ ఆనందమయ జీవితం పొందడానికి ప్రతి ఒక్కరూ కనీసం ఓ అరగంటయినా కేటాయిస్తే మంచి ఫలితం దక్కవచ్చు. ఏటా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రయత్నంగా భావించాలి. యోగాతో మనస్సు, శరీరం అదుపులో ఉంటుందని కూడా నిరూపితం అయ్యింది. ఇది వేల ఏళ్లుగా ఈ ప్రక్రియ సాగుతోంది. అందుకే ఐక్యరాజ్యసమితి మన వినతిని గుర్తించి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రకటిం చింది. జూన్ 21నే యోగా దినోత్సవం జరుపుకోవడానికి గల కారణం ఆరోజు ఉత్తరార్ధ గోళంలో అత్యధిక పగటి సమయం కావడమే. ప్రపం చంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపుపొందడంతో అదేరోజు ను అంతర్జాతీయ యోగా దినోత్సవం గా జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితికి ప్రధాని మోదీ సూచించారు. యోగా దినోత్సవం అందుబాటు లోకి వచ్చాక దీనిని ఓ కార్యక్రమంగా కాకుండా నిరంతర ప్రక్రియగా ఆచరించడం మొదల య్యింది. అనేక దేశాలు, దీనిని ఆరోగ్యంలో భాగంగా అమలు చేస్తున్నాయి. ముస్లిం దేశాలు సైతం దీని ప్రాధాన్యాన్ని గుర్తించాయి. దీర్ఘకాలిక రోగాలను సైతం అదుపు చేసే అవకాశం యోగా ద్వారా లభించగలదు. చాలా మంది యోగా అంటే శారీరక వ్యాయామము, కేవలం కొన్ని శారీరిక కదలికలు ,ఇంకా శ్వాస పక్రియ అని మాత్రమే అనుకుంటారు. నిజానికి మానవుని అనంత మైన మేధాశక్తి , ఆత్మశక్తిల కలయికగా నిరూపితం అయ్యింది. మానవుల ఆరోగ్యాన్ని,శరీరాన్ని, మనసును అదుపులో పెట్టుకునేలా రూపొందించిన అద్భుత ప్రక్రియ యోగ.

ఇది ఎంతో ప్రాచీన కాలం నాటిది. రుషుల సాధనతో యోగా ప్రక్రియను రూపొందించారు. ఇది ప్రపంచానికి భారతదేశం అందించిన మహత్తర ప్రక్రియ. యోగాతో మనిషి శరీరం, మనస్సు, ఆరోగ్యం అదుపులో ఉండగలవు. దీనిలోజ్ఞాన యోగము (తత్వశాస్త్రము ), భక్తి యోగము , రాజ యోగం మరియు కర్మ యోగములు ఉన్నాయి. యోగాసనాలు అంటే రాజయోగ పక్రియలో పైన చెప్పిన యోగాలన్ని టిలో సమతౌల్యాన్ని , ఏకత్వాన్ని తీసుకువస్తాయి. యోగా అనేది ఆరోగ్యకరమైన శక్తిని పుంజుకునే ఆనందకర మైన అనుభూతి. ఇది సులభమైన, కష్టతర మైన శ్వాసపక్రియతో కూడుకున్నటువంటి పక్రియ. దీనిద్వారా శారీరక , మానసిక సమతౌల్యం ఏర్పడు తుంది. ఇది ఒక బహుముఖ ప్రజ్ఞానాన్నికలిగించే కార్యక్రమం. ఇందులో యోగాసనాలు, శ్వాస పక్రియ, యోగాకి సంబంధించిన జ్ఞానము. ఇంకా ధ్యానము పొందుపరుచబడి ఉంటాయి. శరీరం సౌష్టవంగా ఉండేందకు కూడా యోగా ఉపయోగపడుతుందిం. ఇది నేర్చుకునే విద్యార్థులకు తమను తాము ఇంటి వద్ద నే చేసుకోవచ్చు. ఇది క్రొతగా నేర్చుకునేవారికి,రోజు సాధన చేసుకునేవారికీ అన్నిరకముల వయసుల వారికి ఉపయోగ పడుతుంది. చేసేవారి జీవన విధానములో ఎన్నో గొప్ప మార్పులు చోటుచేసుకున్నాయి. దీర్ఘ కాలికమైన అనారోగ్యాల నుండి బయట పడ్డారు. నెర్చుకునే వ్యక్తులు వారి అనుభూతులని వివవరించారు. వారు ఎంతో సంతోషంగా, ఆతురత తగ్గి,ఓర్పు పెరిగి,కుశల బుద్ధి కలిగి, పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతున్నారు. ఇందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

యోగాలో ఉన్న అద్భుత మేమంటే యోగాసనాలు శరీరానికి ధృడత్వాన్ని, శక్తిని ఇస్తాయి. అందుకే పెద్దవారైన, చిన్నవారైన, ధృడంగాఉన్నవారైన,లేనివారైన ఆసనాలు వేయడానికి ఇష్టపడతారు. సాధన చేస్తున్న కొద్ది ఆసనాల వెనకాల ఉన్న అంతరార్ధం బాగా అవగాహనకు వస్తుంది. ఆసనంలో ఉంటూనే బాహ్యకరమైన శారీరక క్రమం నుంచి అంతరంగిక పరివక్రుత అనుభూతిలోకి వస్తుంది. యోగ ద్వారా గర్భిణుల ఆరోగ్యం కుదుట పడి, టెన్షన్‌ల నుంచి బటపడుతున్న తీరు చూస్తున్నాం. అలాగే ఎన్నోరకాల మానసిక రుగ్మతలకు యోగా ద్వారా పరిష్కారం దక్కుతోంది. యోగ మన జీవితంలోని అంతర్భాగమే. యోగ అనేది ఒక్కొక్క రకంగా అర్థమవుతుంది. యోగాలో ప్రధానమైనది ప్రాణాయామం. అనగా ఒకరి శ్వాస మీద పట్టు సాధించడం. ఇంకా శ్వాసను పీల్చే శక్తిని పెంచడం. సరైన శ్వాస పక్రియ శరీరంలోని అధిక ప్రాణవాయువును రక్తంలోనికి, మెదడులోనికి ప్రసరింపచేసి ప్రనసక్తిని పెంపొందిస్తుంది. ప్రాణాయామం అనేక యోగాసనాలు వేయటంలో దోహదపడుతుంది. ఈ రెండింటి సమ్మేళనము ప్రాణాయామం. యోగాసనాలు శరీరానికి మనస్సుకు స్వత్చతను, వ్యక్తిగత అనుసాసనాన్ని ఇస్తాయి. ప్రాణాయామం మెళకువ మనలను లోతైన లేదా ఘాఢమైన ధ్యానములోనికి తీసుకువెళుతుంది. అందుకే విధిగా అంతా యోగాను అలవాటు చేసుకుంటే ఉత్తమమైన జీవన విధానం అలవడుతుంది.

# పాఠశాల స్థాయిలోనే యోగాకు ప్రణాళిక రావాలి

- పిల్లలకు యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభ్యం
- ఆరోగ్యకరమైన సమాజానికి ఇది ఎంతో అవసరం



**న్యూఢిల్లీ, జూన్ 20 :** ఆరోగ్యవంతమైన సమాజం కోసం పాఠశాల స్థాయి నుంచే యోగాను అలవాటు చేయాలన్న డిమాండ్ ఉంది. ప్రైవేట్ పాఠశాలల్లో ఇప్పుడిప్పుడే దీనిని ఓ క్లాస్‌గా గుర్తించి అలవాటు చేస్తున్నారు. సరస్వతీ శిశుమందిర్ లాంటి వాటిలో ఇది తప్పనిసరిగా ఉంటోంది. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వాలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సి ఉంది. ఆట పాటలు, యోగాసనాలతో పిల్లల్లో మానసిక ఆరోగ్యం నింపేందుకు ముందుకు రావాల్సి ఉంది. క్రీడాంశాల్లో యోగగాను జోడించి అనేక ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. ప్రతి ఏటా విద్యాశాఖ ఉపాధ్యాయులకు పాఠ్యాంశాలపై పట్టు సాధించేందుకు అవసరమైన వృత్తి నైపుణ్యాలను అందిస్తోంది. ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి మారిన పాఠ్యాంశాల ఆధారంగా బోధన తీరు మెరుగపడేలా చర్యలు తీసుకుంటుంది. ఎన్నో ఏళ్లుగా వ్యాయామ ఉపాధ్యా యులకు ఎలాంటి శిక్షణ తరగతులు లేవు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థుల ఆరోగ్యం, ఇతర అంశాలపై దృష్టిసారించలేక పోతున్నారు.

### వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

ఈ విషయాన్ని గుర్తించిన విద్యాశాఖ వ్యాయామ ఉపాధ్యాయులకు నాలుగు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించింది. యోగా, ఆరోగ్యం, కరాటే, మానసిక అంశాలపై తర్ఫీదునిచ్చారు. విద్యార్థులకు ఆత్మస్థైర్యం పాఠాలు బోధించేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా వసతులు కరవయ్యాయి. ప్రార్థన చేసేందుకు స్థలం కొరత పీడిస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఏడాదిలో స్వాతంత్య, గణతంత్య వేడుకల సమయంలో తప్ప క్రీడా పోటీల ఊసేలేదు. ఆసక్తి ఉన్నా విద్యార్థుల్లో ప్రతిభ కనుమరుగవుతోంది. అప్పడప్పుడు మండల, జిల్లా స్థాయి పోటీలకు తప్ప రాష్ట్ర, దేశ స్థాయిలో గుర్తింపు కరవైంది. సగానికిపైగా పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలుగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రాధాన్యం లేక నిరాశకు గురవుతున్నారు. ఇన్నాళ్లుగా ఈ అంశాలకు దూరమైన పిల్లలకు సంపూర్ణత చేకూర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

### వ్యాయామ విద్య అమలు

మానసిక వికాసం, శరీర దారుఢ్యంతోపాటు మెదడు చురుకుదనంతో ఉండేలా సమగ్ర నిరంతర మూల్యాంకనం విధానంలో భాగంగా వ్యాయామ విద్యను తప్పనిసరిగా అమలు చేయాలని నిర్ణయించారు. యోగా, ఆత్మరక్షణ కోసం కరాటే, క్రీడలు, ఆర్యోగంతో సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్తు ను చక్కదిద్దుకుంటారు. ఆటలతోపాటు వ్యక్తిగత ఆరోగ్య పాఠాలు బోధించాలి. క్రీడల్లో ఉత్తేజపూరితంగా తర్ఫీదు ఇచ్చేలా శిక్షణ ఇవ్వాలి.. ప్రతి రోజు వ్యాయామ, ఆరోగ్య విద్యను అమలు చేసేందుకు ప్రణాళికలు చేపట్టాలి. యోగాకు ప్రతి రోజు ఓ పీరియడ్ కేటాయించాలని సూచిస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రోజువారీగా నిర్ణయించిన ప్రణాళికను అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలి. క్రీడా మైదానాలను సిద్ధం చేయాలని, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్న డిమాండ్లు ఉన్నాయి. ఇతర దేశాల్లో బాల్య దశలోనే ఆరోగ్యం, మానసిక ఉల్లాసాన్ని అందిస్తున్నారు. మన దగ్గర ఆటలాడు కోవాలనే ఆసక్తి ఉన్నా ఆట స్థలం కరువే...ప్రతిభ ఉన్నా శిక్షకుడి సేవలు దూరమే...ఎలాంటి శిక్షణ లేకున్నా ఏకలవ్యులా పలు పోటీల్లో విద్యార్థులు సత్తాచాటుతున్నారు. సగానికిపైగా పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ...మరికొన్నిటికి పోస్టుల మంజూరు లేదు.. విద్యార్థుల్లో మానసిక పరిపక్వత లోపిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా వసతులు ఆందోళన కల్గిస్తున్నాయి. క్రీడా మైదానాలు లేని చోట సమీపంలో అందుబాటు లో ఉన్న స్థలాలను ఎంపిక చేసుకుని తీసుకోవాలి. సగానికిపైగా ఖాళీలు ఉండటంతో వీటిని భర్తీ చేయాలి. క్రీడాకారుల ప్రయోజనం కోసం ఆట వస్తువులు, ఇతర వసతులు కోసం నిధులను కేటాయించాలి. విద్యాక మిటీ సభ్యులను భాగస్వాములను చేసి ప్రజా విరాళాలతో ముందుకుసాగేలా ప్రతిపాదనలు తయారు చేసుకోవాలి. ఉన్నత పాఠశాలల్లో వ్యాయామ విద్య అమలు చేస్తున్నప్పటికీ ప్రాథమికస్థాయిలో లేకపోవడం అన్యాయమే. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ విద్యను పకడ్బందీగా అమలు చేస్తుండగా ప్రైవేటు పాఠశాలల పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకమే. పలు పాఠశాలలకు క్రీడా వసతులు లేవు. పాఠశాలల గుర్తింపునకు ముందు కనీస వసతులు ఉంటేనే అనుమతి పత్రం ఇవ్వాలి. నిబంధనలు పాటించకుండానే అనుమతులు ఇవ్వడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ప్రార్థన చేసుకునేందుకూ స్థలం లేకపోవడం గమనార్హం. ప్రైవేటు పాఠశాలల్లో కూడా వ్యాయమ విద్య పక్కాగా అమలు చేస్తే క్రీడా వెలుగులు అందుతాయి.

# మిర్చి కన్నా పత్తి సాగే బెటర్

## పత్తివైపు అధిక రైతుల మొగ్గు



**ఆదిలాబాద్, జూన్ 20 :** అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి.. అన్న చందంగా మారింది మిర్చి రైతుల పరిస్థితి. ప్రభుత్వాల అసమర్థత కారణంగా ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అల్లాడారు. కనీసం పండించిన పంటను అమ్ముదామంటే మార్కెట్లో కొనేవారు కరవయ్యారు. దిక్కుతోచక పంటను కొందరు స్వయాన తగులబెట్టి తమ కడుపు మంటను వెళ్లగక్కారు. మరికొందరు కూలీ కూడా వెళ్లదని పంటను చేలల్లోనే వదిలేసారు. చేసేది లేక నిస్సహాయంగా ఆగ్రహాన్ని, ఆవేదనను తమలోనే అణచివేసుకున్నారు. దీంతో ప్రస్తుతం మళ్లీ మిర్చివేయాలంటేనే భయపడుతున్నారు. దీంతో మరో మారు పత్తి వేసేందుకు రైతులు సమాయత్తం అయ్యారు. మిరప పంట సాగు చేసినా అందుకు తగ్గట్లు మార్కెట్ సౌకర్యం లేకపోవడం, రోజురోజుకు ధర తగ్గడం వల్ల మిరప పంట సాగుచేసిన రైతులకు శాపంగా మారింది. పత్తి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ప్రభుత్వం సూచించిన మేరకు అన్నదాతలు పంట మార్పిడికి శ్రీకారం చుట్టారు. దీనికితోడు జిల్లాలో మిరప పంటకు అనువైన నేలలు ఉండటంతో ఎక్కువ మంది రైతులు పత్తికి బదులు మిరప వైపు మొగ్గుచూపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పత్తి, వరి పంటల తర్వాత మూడో పంటగా మిరప సాగు చేయడం విశేషం. పంటను మార్కెట్‌కు తరలిస్తే ఖర్చులు కూడా వెళ్లక మిరప రైతు కుదేలు అయ్యారు. మొదట తీసిన పంటే పూర్తి స్థాయిలో అమ్మకపోగా.. కనీసం మరో రెండు దఫాలుగా తీయాల్సిన పంట చేలోనే ఉండిపోయింది.

# మాపై దాడులు ఆపాలని భారత్‌ను అడిగాం

## పాక్ ఉప ప్రధాని



**పాకిస్థాన్ :** పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా భారత్.. పాకిస్థాన్‌లోని అనేక ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకొని క్షిపణి దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. అనంతరం ఇరుదేశాలు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందాన్ని తానే కుదిర్చానని చెప్పుకుంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ప్రధాని మోదీ ఇచ్చిన స్పష్టతతో మాట మార్చుకున్నారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గురించి తాజాగా పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో తమపై దాడులు ఆపాలని భారత్‌ను కోరిన మాట వాస్తవమేనని అంగీకరించారు. ఆ సమయంలో భారత్ తమ ముఖ్య వైమానిక స్థావరాలైన నూర్‌ఖాన్, షోర్కోట్‌లపై దాడి చేసిందని ఇషాక్ దార్ వెల్లడించారు. ఈ దాడుల వల్ల తమ దేశానికి భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉండడంతో ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని అమెరికాను కోరినట్లు తెలిపారు. సౌదీ యువరాజు ఫైజల్ ఫోన్‌కాల్ ద్వారా భారత విదేశాంగశాఖ మంత్రి ఎస్. జైశంకర్‌తో సంప్రదింపులు చేశామని వివరణ ఇచ్చారు. "ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ మే 7న పాక్‌లోని పలు స్థావరాలను లక్ష్యంగా చేసుకొని క్షిపణి దాడులు చేసింది. అనంతరం ఇరుదేశాల మధ్య జరిగిన దాడుల్లో భారత సైన్యం నూర్ ఖాన్ వైమానిక స్థావరం, షోర్కోట్ వైమానిక స్థావరంపై దాడి చేసినట్లు గుర్తించాము. సౌదీ యువరాజు ఫైసల్ నాకు ఫోన్ చేశాడు. కాల్పుల విరమణ గురించి భారత్‌తో మాట్లాడాలా అని ఫైసల్ అడగగా.. సహాయం చేయమని ఆయనను కోరాను. మరోవైపు ఈ విషయంపై అమెరికాతోనూ చర్చలు జరిపాము. అనంతరం ఫైసల్ మళ్లీ కాల్ చేసి తాను భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో ఫోన్‌లో మాట్లాడానని.. భారత్ కూడా కాల్పుల విరమణకు సానుకూలంగా ఉందని ఆయన తెలిపారు" అని ఇషాక్ దార్ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్‌లోని ఉగ్రస్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాదాపు డజను సైనిక స్థావరాలను భారత్ ధ్వంసం చేసింది. భారత క్షిపణులు పాక్ ఆయుధాగారాలు, ఎఫ్-16, జేఎఫ్-17 వంటి విమానాలు దాచిన సర్గోదా, భోలారీ ఎయిర్ పోర్టులతో పాటు.. పాక్ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ ఉన్న చక్లాలలోని నూర్‌కాన్, షోర్‌కోట్ ఎయిర్ బేస్‌లను కూడా ధ్వంసం చేశాయి. రావల్పిండిలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ సమీపంలో ఇండియన్ ఆర్మీ ప్రిసిషన్ స్ట్రైక్స్ చేసింది. దానికి అతిచేరువలో పాక్ న్యూక్లియర్ కమాండ్ కంట్రోలు ఉంది. అణ్వాయుధాలను నియంత్రించడం, నిల్వ చేయడంలో దీని పాత్ర అత్యంత కీలకం. భారత్ దాడుల తీవ్రతకు వణికిపోయిన పాక్ చివరకు కాళ్లబేరానికి వచ్చింది. ఉగ్రస్థావరాలను ధ్వంసం చేయాలనే లక్ష్యం నెరవేరడంతో కాల్పుల విరమణకు భారత్ సైతం అంగీకరించింది.

# నా వీర్యదానంతో జన్మించిన 100 మందికి సంపద పంచేస్తా

## టెలిగ్రామ్ సీఈఓ మరో సంచలన ప్రకటన



**న్యూయార్క్ :** ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు, సీఈఓ పావెల్ దురోవ్ మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా 100 మందికి పైగా పిల్లలకు తాను బయోలాజికల్‌గా తండ్రినని గతంలో చెప్పిన పావెల్.. ఇప్పుడు ఆ పిల్లలందరికీ తన సంపదను పంచేస్తానంటూ మరో సంచలన ప్రకటన చేశారు. ఈమేరకు తన భవిష్యత్ ప్రణాళికను వెల్లడించారు. 15 ఏళ్ల పాటు తాను చేసిన వీర్యదానంతో ప్రపంచవ్యాప్తంగా 12 దేశాల్లో 100 మంది పిల్లలు జన్మించినట్లు గతేడాది జులైలో ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీని గురించి ప్రస్తావించిన ఆయన.. మరో ఆసక్తికర విషయాన్ని తెలిపారు. ఇటీవలే తాను వీలునామా రాశానని, అందులో ఈ సంతానం గురించి కూడా పేర్కొన్నట్లు తెలిపారు. తాను సహజంగా జన్మనిచ్చిన సంతానంతో పాటు ఈ 100 మంది పిల్లలకు కూడా తన ఆస్తిలో సమాన హక్కు ఉంటుందని వెల్లడించారు. దాదాపు 20 బిలియన్ డాలర్ల తన సంపదను వీరందరికీ సమానంగా పంచుతానని తన వీలునామాలో పేర్కొన్నట్లు తెలిపారు. అయితే, ఈ సంపదను 30 ఏళ్ల వరకు వారు పొందలేరని, తన పిల్లలు స్వతంత్రంగా జీవించేలా ఎదగాలని కోరుకుంటున్నట్లు పావెల్ పేర్కొన్నారు. వివాహం కానప్పటికీ తనకు ముగ్గురు సహజీవన భాగస్వాములు ఉన్నారని, వారికి ఆరుగురు సంతానం అని టెలిగ్రామ్ సీఈఓ తెలిపారు. తన జీవితం ఎన్నో సవాళ్లతో ముడిపడి ఉందని, ఎంతోమంది శత్రువులు ఉన్నట్లు చెప్పారు. అందుకే, 40 ఏళ్ల వయసులోనే వీలునామా రాయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కథనం నెట్టింట వైరల్‌గా మారింది. వీర్యదానం గురించి పావెల్ గతేడాది పోస్ట్ చేస్తూ ఈ సంతానం విషయాన్ని వెల్లడించారు. "నాకు 100 మందికి పైగా సంతానం ఉన్నారు. పెళ్లి చేసుకోకుండా ఒంటరి జీవితానికి ఇష్టపడుతున్న ఓ వ్యక్తికి ఇదెలా సాధ్యమైందని అనుకుంటున్నారా? 15 ఏళ్ల కిందట నా స్నేహితుడొకడు నన్ను కలిసి వింత సాయం కోరాడు. నా మిత్రుడికి, అతడి భార్యకు పిల్లలు పుట్టే అవకాశం లేకపోవడంతో సంతానం కోసం నన్ను వీర్యదానం చేయమని అడిగాడు. అది విని నేను విపరీతంగా నవ్వుకున్నా. కానీ, ఈ సమస్య ఎంత తీవ్రమైందో ఆ తర్వాతే అర్థమైంది. దీంతో స్పెర్మ్ డొనేషన్‌లో రిజిస్టర్ చేసుకున్నా. అలా ఇప్పటి వరకు 12 దేశాల్లో వందమందికి పైగా జంటలకు సంతానాన్ని అందించా. చాలా ఏళ్ల క్రితమే వీర్యదానాన్ని నేను ఆపినప్పటికీ.. ఇంకా ఫ్రీజ్ చేసిన నా కణాలతో ఎన్నో కుటుంబాలకు సంతానం కలిగిస్తున్నారని తెలుసుకున్నా" అని పావెల్ నాడు వివరించారు.

# మన నేరెళ్లను మనమే మరిచామా?

- మిమిక్రీ కళకు ప్రాణం పోసిన వేణుమాధవ్
- ప్రపంచానికి ప్రతిభను చాటిన మహనీయుడు



**వరంగల్, జూన్ 20 :** మిమిక్రీ అనే కళను ప్రపంచానికి పరిచయం చేసి, దానిని ఐక్యరాజ్య సమితి వరకు తీసుకెళ్లిన ధీశాలి మన నేరెళ్ల వేణుమాధవ్ ధన్యజీవి. అంతటి మహానుభావుడు ఓ సామాన్యుడిలా మన కళ్లముందే నడయాడి మనలను వీడి వెళ్లారు. జూన్ 19న ఆయన వర్ధంతి. అయితే 19న పెద్దగా ఆయనను ఎవరూ పట్టించుకోలేదు. స్మరించు కోలేదు. ఆయన ప్రేమించి, ప్రవచించిన మిమిక్రీని సజీవంగా మనకందించారు. మిమిక్రీ ఉన్నన్నాళ్లు నేరెళ్ల వేణుమాధవ్ మనకు సాక్షాత్కరిస్తూనే ఉంటారు. వరంగల్ నుంచి ప్రారంభమైన నేరెళ్ల వేణుమాధవ్ మిమిక్రీ ప్రస్థానం ఐరాస వరకు వెళ్లిందంటే తెలుగువారిగా మనకన్న గర్వించేవారు ఉండరు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కాలంలోనే అమెరికాలో ప్రదర్శనకు అవకాశం రావడంతో ఆయన పేరు దేశ వ్యాప్తంగా మార్మోగినప్పుడు తెలుగువారి గుండెలు మరింత పులకించి ఉంటాయి. ఆనాటి ఘటనలు తలుచుకుంటే నేటికీ మనం పులకించకుండా ఉండలేం. ఓ కళను సృష్టించిన స్రష్ట ఆయన. దానిని శబ్దప్రక్రియ గా ఓ సబ్జక్టుగా రూపొందించి భావి తరాలకు మార్గం చూపా రు. అయినా పురాణాల్లోనే ఇలాంటి చాతుర్యం ఉందని, అదంత భగవత్ కృప అని చెప్పుకుని, తన గొప్పతనమేమీ లేదని చెప్పుకోవడం ఆయన ఉదాత్తకు తార్కాణం. తనకు అబ్బిన మిమిక్రీ కళను ప్రపంచ వ్యాప్తంగా సుమారు 30 దేశాల్లో ప్రదర్శనలుగా ఇవ్వడం ఒక ఎత్తయితే 1971లో ఐక్యరాజ్య సమితిలో ప్రపంచ ప్రముఖుల గొంతులను అనుకరించి ప్రపంచం దృష్టినీ ఆకర్షించడం మరొక ఎత్తు. తన గొంతులో వెయ్యి గొంతుకలను పలికించడం ద్వారా మిమిక్రీ కళను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కళాకారుడు తెలుగువాడయినందుకు... భారతీయుడైనందుకు మనమంతా గర్వపడాలి. పదో ఏటలోనే మిమిక్రీ కళపై మక్కువ పెంచుకున్న నేరెళ్ల తన ఆశయం మేరకు మిమిక్రీపైనే దృష్టి సారించి దానిని జగద్విఖ్యాతం చేయకుండా ఉండివుంటే ఇవాళ మిమిక్రీ అన్నది ప్రపంచానికి తెలిసేది కాదు. ఆయన జీవితం ఓ పాఠం. ఆధునిక తరానికి ఓ సక్సెస్ స్టోరీ. పోతన పుట్టిన ఓరుగల్లులో పుట్టిన మట్టిబిడ్డగా వేణుమాధవ్ తన గళం బలంతో ప్రపంచాన్ని శాసించారు. తొలితరం నటుడైన చిత్తూరు నాగయ్య స్వరాన్ని అనుకరించడం ద్వారా తన కళా ప్రస్థానానికి బాటలు వేసుకున్నది మొదలు ఆయన గొంతుకలో ఎందరి గొంతుకలు ఇమిడి పోయాయో చెప్పలేం. మహామహులే ఆయన గొంతుకకు పాదా క్రాంతులయ్యారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టినా.. తనకు గుర్తింపు తెచ్చిన మిమిక్రీని మాత్రం వదలకుండా పెనవేసుకుని పోయారు. అలా మొదలైన ప్రస్థానం పది వేల ప్రదర్శనల వరకు కొనసాగిందం టే ఆయన పట్టుదల ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. మిమిక్రీకి ఏమాత్రం గుర్తింపు లేని రోజుల్లోనే ఆ కళపై మక్కువ పెంచు కుని దానికి అర్థం పరమార్థం చెప్పి ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి మన వేణు మాధవ్ ధన్యజీవి. ఆయన ప్రతిభా పాటవాలను గుర్తించిన భారత ప్రభుత్వం 2001లో పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసింది. కాకతీయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్లు ఇచ్చి సత్కరించాయి.



## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** వలిగొండ మండలంలోని వేములకొండ గ్రామ పంచాయతీ సిబ్బంది అయిన కాడిగళ్ల రాములమ్మ ఇటీవల మరణించడం జరిగింది. నిరుపేద కుటుంబం కావడంతో శుక్రవారం రోజున వారి దశదినకర్మ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది వలిగొండ మండల కమిటీ తరపున 5000 రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కేహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డిని కలిసిన మంగ శ్రీనివాస్



**ఆత్మకూర్(ఎం) రాజముద్ర న్యూస్:** ప్రముఖ వ్యాపార వేత్త బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డిని మర్యాద పూర్వకంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు మంగ శ్రీనివాస్ కలవడం జరిగింది. ఈ సందర్బంగా మంగ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆత్మకూరు మండల ప్రజలు ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సహాయం అందజేస్తూ నిరుపేదలకు అండగా ఉంటున్నందుకు వారికీ కృతజ్ఞతలు తెలిపారు.



## మోతే పిచ్చిరెడ్డి, పూలమ్మ దంపతులకు స్వదేశాగమన శుభాకాంక్షలు

**ఆత్మకూరు (ఎం) రాజముద్ర న్యూస్:** ఉమ్మడి నల్గొండ జిల్లా తాజా మాజీ పశు గణాభివృద్ధిసంస్థ చైర్మన్ మోతే పిచ్చి రెడ్డి వారి సతీమణి నార్నాక్స్ డైరెక్టర్ మోతే పూలమ్మ అగ్రరాజ్యమైన అమెరికా వెళ్లి 100 రోజులు అక్కడ గడిపి ఆయా రాష్ట్రాల్లో ఉన్న ముఖ్య నగరాల సందర్శించి 100 రోజులు తరువాత మంచి ఆయురారోగ్యాలతో స్వదేశానికి తిరిగి వస్తున్న శుభ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ ఆత్మకూర్ ఎం మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి మోహన్ రెడ్డికూరెళ్ళ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు భాష బోయిన సత్యనారాయణ ఘనగాని శ్రీనివాసులు ఆత్మకూరు తాజా మాజీ వైస్ ఎంపీపీ భాష బోయిన పద్మ పాపయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు ఎండి మౌలానా ఇరుకుల శ్రీనివాస్ గుప్తా సుదగాని లక్ష్మయ్య కూరెల్ల రమేష్ భాష బోయిన వెంకటయ్య, బెజ్జంకి భిక్షం, సోమనబోయిన సత్తయ్య, కురెల్ల రవి భాషబోయినలింగం, గడ్డం నరేష్, నర్రాముల,గణేష్ , ఉప్పల్ నరసింహ, నార్కట్పల్లి సహదేవ్, భాష బోయిన నవీన్, నర్రాములనరసయ్య, కప్పల నరసయ్య జంజీరాల సోమయ్య, మేడబోయిన రవి,మరియు కాంగ్రెస్ పార్టీ కూరెళ్ళ గ్రామ శాఖ తరపున వారిని సాదరంగా స్వదేశానికి స్వాగతిస్తున్నామని తెలిపారు.



## ప్లాంట్స్ గివింగ్ డే సందర్భంగా మొక్కల పంపిణీ

**వలిగొండ రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ అధ్వర్యంలో శుక్రవారం ప్లాంట్స్ గివింగ్ డే సందర్భంగా విద్యార్థులకి ఫలాలు, నీడ ఇచ్చే మొక్కలు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎంపిడిఓ డి. జితేందర్ రెడ్డి, మండల విద్యాధికారి మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకోజు భాస్కర్ లు హాజరయ్యారు. ఈ కార్యక్రమం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జి.స్వామి రాజ్ సమక్షంలో జిల్లా కో ఆర్డినేటర్ బత్తుల గణేష్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకి ఎంపిడిఓ, విద్యాధికారి, తదితరులు చేతుల మీదుగా మొక్కల అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కార్యాలయ సూపరిండెంట్ నిరంజన్ అలీ, ఉపాధి హామీ ఏపిఓ పరుషరాములు, ఇంజనీర్ బి.విక్రమ్, పంచాయితీ కార్యదర్శి నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, లీగల్ సెల్ కానుగంటి శ్రీశైలం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి

- 100 రోజుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా వనమహోత్సవంలో శ్రీ సాయి నగర్ లో మొక్కలు నాటిన మాజీ కార్పొరేటర్

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 100 రోజుల అభివృద్ధి కార్యచరణ కార్యక్రమంలో భాగంగా వనమహోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ మేరకు గిరిజాదిగూడ నగర పీర్జాదిగూడ నగర 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయి నగర్ లో స్థానిక అసోసియేషన్ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని అదేవిధంగా వాటిని సంరక్షించాలని కోరారు. పచ్చదనం పరిశుభ్రత కు పెద్దపీట వేస్తూ పరిసరాలను పచ్చదనంతో పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రవీందర్ చారి, కాలనీ వాసులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణానికి అసలు సూత్రధారులు ఎవరు..?

- 3వ డివిజన్ సాయిప్రియ కాలనీ రోడ్ నెంబర్ 3లో అక్రమ నిర్మాణం
- సుమారు 80 గజాలలో ఎలాంటి డాక్యుమెంట్ లేకుండా, ప్రభుత్వ అనుమతి లేకుండా యదేచ్ఛగా అక్రమ నిర్మాణం
- ఈ అక్రమ నిర్మాణం వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు
- అధికారులు ఈ నిర్మాణంపై చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచి చూడాలి



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** పీర్జాదిగూడ నగరంలో రోజురోజుకు కబ్జారాయుళ్ళు రెచ్చిపోయి ఎక్కడ ప్లాట్ కనపడితే అక్కడ కబ్జా చేస్తూ యదేచ్ఛగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టరాజ్యంగా నిర్మాణం చేస్తున్న బాగోతం బట్టబయలైంది. వివరాల్లోకి వెళితే... పీర్జాదిగూడ నగర పరిధిలోని 3వ డివిజన్ సాయిప్రియ కాలనీ రోడ్ నెంబర్ 3 లో సుమారు 80 గజాల ప్లాట్ ను కబ్జా చేసి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కమర్షియల్ గా నిర్మాణం చేస్తున్నారు. అసలు ఈ అక్రమ నిర్మాణం వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరో ఇప్పటికీ అంతుచిక్కని విషయంగానే ఉంది. దీనిపై వెంటనే పీర్జాదిగూడ మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిన అవసరం ఉంది. ఇదే కాకుండా పీర్జాదిగూడ నగరంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు కోకోల్లలుగా నిర్మితమవుతున్నాయి. తక్షణమే అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని నగరాభివృద్ధికి సహకరించాలని పలువురు కోరుతున్నారు.

## పాఠశాల బస్సులు, వ్యాన్‌లపై జిల్లా పోలీసుల ప్రత్యేక నిఘా

### జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** జిల్లాలో పాఠశాలలు తిరిగి తెరుచుకుంటున్న నేపథ్యంలో విద్యార్థుల రవాణాకు ఉపయో గించే పాఠశాల వ్యాన్లు, బస్సులపై ప్రత్యేక నిఘా ఉంచాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి శుక్రవారం జిల్లా పోలీసు అధికారులకు టెలీ కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. విద్యార్థుల భద్రతే ప్రథమ ప్రాధాన్యత అని ఈ సందర్భంగా ఎస్పీ నారాయణ రెడ్డి స్పష్టం చేశారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఎస్పీ మాట్లాడుతూ పాఠశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా ప్రభు త్వ నిబంధనలను పాటించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులను తీసుకెళ్లే వాహనాలకు గుర్తింపు పొందిన డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వ్యక్తులనే డ్రైవర్లుగా నియమించాలి అని స్పష్టం చేశారు. అలాగే రవాణాకు ఉపయోగించే వాహనాలు తప్పనిసరిగా ఫిట్‌నెస్ కలిగి ఉండాలి అని ఆదేశించారు. కాలం చెల్లిన లేదా ఫిట్‌నెస్ లేని వాహనాలను విద్యార్థుల రవాణాకు ఉపయోగించరాదని హెచ్చరించారు. ఎస్పీ కొన్ని కీలక ఆదేశాలు ఇచ్చారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు (రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పర్మిట్, కాలుష్య నియంత్రణ పత్రం ) సక్రమంగా ఉండాలి. పత్రాలు లేని వాహనాలను సంబంధిత అధికారులతో కలసి తక్షణమే సీజ్ చేయాలని ఆదేశించారు. డ్రైవర్ల పూర్తి వివరాలు వారి చిరునామా ఫోన్ నంబర్లు, పోలీస్ వెరిఫికేషన్ నివేదికలను పాఠశాల యాజమాన్యం వద్ద తప్పనిసరిగా ఉంచుకోవాలని డ్రైవర్ల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలని అన్నారు. డ్రైవర్లు డ్రంక్ డ్రైవ్ చేయకూడదని ఎస్పీ హెచ్చరించారు. యాజమాన్యాలు డ్రైవర్ల అలవాట్లపై నిఘా పెట్టాలని మద్యం సేవించి వాహనం నడిపే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సీటింగ్ సామర్థ్యం:**

వాహనాల సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించకూడదని ఇది ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని గుర్తు చేశారు. ఓవర్‌లోడింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పాఠశాల వాహనాలు నిర్ణీత వేగ పరిమితిని మించకుండా చూసుకోవాలి. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలు, రద్దీ ప్రాంతాల్లో వేగ పరిమితిని తప్పనిసరిగా పాటించాలి. పాఠశాల యాజమాన్యాలు తమ వాహనాల్లో సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి వాహనంలో తప్పనిసరిగా మహిళా సహాయకులు లేదా కేర్ టేకర్ ఉండాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించడానికి హెల్ప్‌లైన్ నంబర్లను వాహనం వెలుపల స్పష్టంగా ప్రదర్శించాలి. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పాఠశాల బస్సులు, వ్యాన్లను అకస్మికంగా ఆర్‌టిఏ అధికారులతో కలసి తనిఖీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగాలని సూచించారు. డ్రైవర్లకు, విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, భద్రతా ప్రమాణాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పాఠశాల యాజమాన్యాలకు సూచించారు. ఈ చర్యలన్నీ విద్యార్థుల సురక్షిత ప్రయాణానికి దోహదపడతాయని, ప్రజలు, తల్లిదండ్రులు కూడా విద్యార్థుల రవాణా పైన నిఘా పెట్టాలని, ఏమైనా నిబంధనల ఉల్లంఘనలు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కె. నారాయణ రెడ్డి కోరారు. పోలీసులకు సహకరించి విద్యార్థుల భద్రతకు తోడ్పడాలని అన్నారు.

## రైతుల ఖాతాలలో వానాకాలం పంట పెట్టుబడి నిధులు జమ

**రైతు భరోసాతో అన్నదాతకు ఆదెరువు కల్పించిన ప్రభుత్వం**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వ్యవసాయాన్ని పండుగలా మారుస్తూ రైతులకు బాసటగా నిలవాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన వికారాబాద్ జిల్లాలోని అందరు రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తోందని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. వానాకాలం – 2025 సీజన్ కు సంబందించి పంట పెట్టుబడి సాయం క్రింద జిల్లాలో 3,18,462 మంది రైతులకు గాను రూ. 384.4 కోట్ల నిధులు రావాల్సి ఉండగా శుక్రవారం వరకు 2,48,031 మంది రైతులకు రూ. 264 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తోందని అన్నారు. రైతుల బ్యాంకు ఖాతా వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు ఇప్పటికే రైతు భరోసా పోర్టల్ లో నమోదు చేశారని అన్నారు. ఈ వివరాలకు అనుగుణంగా శుక్రవారం సాయంత్రం వరకు జిల్లాలోని రైతుల ఖాతాలలో రూ. 264.కోట్ల నిధులు ఇప్పటికే జమ అయ్యాయని కలెక్టర్ వివరించారు. పెట్టుబడి సాయం ప్రారంభించి శుక్రవారం వరకు వ్యవసాయ భూమి కలిగిన జిల్లాలోని రైతుల ఖాతాలలో ఎకరాకు పంట పెట్టుబడి సాయం నిధులను ప్రభుత్వం వారి ఖాతాలలో జమ చేసిందని తెలిపారు. శుక్రవారం వరకు ఐదు ఎకరాల వరకు సాగు భూమి ఉన్న రైతుల ఖాతాలలో నిధులు జమ చేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు. పెట్టుబడి భారం తగ్గించి వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు రైతు భరోసా ఉపయుక్తంగా నిలుస్తుందని కలెక్టర్ అన్నారు.



## అనాథాశ్రమానికి విరాళం

- సామాజిక బాధ్యతగా అనాథాశ్రమానికి రూ లక్ష అందజేసిన టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్

**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్:** సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు సమాజాభివృద్ధికి చేయగలిగినంత కృషి చేయాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పిలుపునిచ్చారు. మూసాపేట హెచ్పి రోడ్ లోని సాయి సేవా సంఘం ఆహ్వానం మేరకు అనాథ పిల్లల ఆశ్రమంలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటలు, కళలు, వివిధ నృత్యాల్లో తమ ప్రతిభ పాటవాలను అద్భుతంగా ప్రదర్శించారు. ఈ చిన్నారుల క్రమశిక్షణ అహుతులను విశేషంగా ఆకట్టుకుంది. సాయి సేవా సంఘం చిన్నారులను తీర్చిదిద్దుతున్న విధానాన్ని రమేష్ అభినందించారు. అనాథ పిల్లల పరిస్థితిలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పరిస్థితులపై చలించిన రమేష్ తనవంతుగా లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అప్పటికప్పుడే ప్రకటించారు. దీనిపై ఆశ్రమ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ప్రదీప్, అరుణ, సుశీల, నాయకులు లక్ష్మయ్య, శివ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్‌ను బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్ట్ ను బెదిరించడంతో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మేడిపల్లి సిఐ గోవింద్ రెడ్డి తెలిపారు. వివరాలలోకి వెళ్ళితే మేడిపల్లి మండల న్యూస్ తెలంగాణ దినపత్రిక జర్నలిస్టు విధి నిర్వహణలో భాగంగా అక్రమ నిర్మాణంపై కథనం వ్రాయడంతో బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీకి చెందిన దయ్యాల మహేష్ అను వ్యక్తి జర్నలిస్ట్ ఇంటికి వెళ్ళి నువ్వు నా ఇంటిపై కథనం ఎలా వ్రాశావని, నీ అంతు చూస్తానని బెదిరింపులకు పాల్పడంతో ఆ వ్యక్తిపై విచారణ జరిపి బి ఎన్ ఎస్ 351(2), 351 సెక్షన్ల కింద నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



## స్పీకర్‌ను కలిసిన మహావీర్ హౌస్ సర్జన్ డాక్టర్లు

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మహావీర్ మెడికల్ కళాశాలలో హౌస్ సర్జన్ డాక్టర్లు ప్రతి నెల స్టైఫెండ్ ఇవ్వడం లేదని నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహావీర్ మెడికల్ కాలేజ్ హౌస్ సర్జన్ డాక్టర్లు ప్రతినెల రావలసిన స్టైఫెండ్ ఇవ్వడం లేదని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కు గురువారం కలిసి లిఖితపూర్వకంగా తెలిపారు.

రాజముద్ర
www.rajamudranews.com
తెలుగు దిన పత్రిక



## చిన్నారులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలి

### టీపీసీసీ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని దామోదర సంజీవయ్య కాలనిలో గురువారం అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన "బడి బాట" కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కూకట్ పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొండ కింది పుష్పారెడ్డి, ఐసిడిఎస్ సూపర్ వైజర్ స్వరూప, బస్తీ డాక్టర్, మరియు మహిళా కాంగ్రెస్ నాయకురాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుష్పారెడ్డి మాట్లాడుతూ ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధన చేయాలని సూచించారు. ముఖ్యంగా పౌష్టికాహారంతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం ఉంటుం దన్నారు. అంగనవాడీ వర్కర్లు ప్రభుత్వం చేపట్టిన జాన జ్యోతిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వారం రోజులపాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. నేటి బాలలే. రేపటి పౌరులు కాబట్టి.. 3నుండి 6 సంవత్సరాల చిన్నారులను ప్రైవేటు ప్లే స్కూళ్ళ కు వెళ్ళకుం డా.. అంగన్వాడీ కేంద్రాలకు పంపించి పిల్లలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగించుకోవాలని పుష్పారెడ్డి సూచించారు.

## ఒక్క ఫోన్‌కాల్ లీక్.. ప్రధానికి పదవీ గండం



**థాయ్‌లాండ్ :** అధికారం చేపట్టిన 10 నెలలకే థాయ్‌లాండ్ యువ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రాకు పదవీగండం ఎదురైంది. పొరుగుదేశం నేతకు ఆమె చేసిన ఓ ఫోన్ కాల్ లీక్ అవడం.. పీఠానికి ఎసరు పెట్టింది. ఆమె ప్రధాని పదవికి రాజీనామా చేయాలని డిమాండ్లు వెల్లువెత్తగా.. ఇప్పటికే సంకీర్ణ ప్రభుత్వానికి ప్రధాన భాగస్వామి మద్దతు ఉపసంహరించుకుంది. ఇంతకీ ఏం జరిగింది..?

### ఫోన్‌కాల్ తెచ్చిన తిప్పలు..

థాయ్‌లాండ్‌కు పొరుగున ఉన్న కంబోడియా మాజీ ప్రధాని హున్‌సేన్ 2023 వరకు అధికారంలో ఉన్నారు. ఆ తర్వాత పదవి నుంచి దిగిపోగా.. ఆయన కుమారుడు హున్ మానెట్ అధికార పగ్గాలు చేపట్టారు. అయితే, పదవిలో లేకపోయినా కంబోడియా రాజకీయాలను ప్రభావితం చేయగల వ్యక్తి హున్‌సేన్. ఇటీవల ఆయనకు థాయ్ ప్రధాని షినవత్రా ఫోన్ చేశారు. అంకుల్ అంటూ ఆయనను సంబోధించిన ఆమె.. తన దేశంలోని పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా థాయ్ ఆర్మీ కమాండర్ తనకు వ్యతిరేకంగా ఉన్నాడని పేర్కొన్నారు. అయితే, వీరిద్దరి మధ్య జరిగిన ఈ ఫోన్‌కాల్ సంభాషణ లీకైంది. సాధారణంగానే కంబోడియా-థాయ్‌లాండ్‌ల మధ్య సంబంధాలు అంతంతమాత్రంగానే ఉండగా.. సరిహద్దు వివాదాల కారణంగా ఈ మధ్యకాలంలో అవి మరింతగా దెబ్బతిన్నాయి. ఈ తరుణంలో ప్రధాని పొరుగుదేశం నేతతో మాట్లాడిన తీరు వివాదాస్పదమైంది. ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి. సొంత పక్షం నుంచే ఎదురుదెబ్బ తగిలింది. ప్రధాని ఫోన్‌తో తమ దేశ పరువు, ఆర్మీ గౌరవం దెబ్బతిన్నాయని ఆరోపిస్తూ షినవత్రా సంకీర్ణ ప్రభుత్వం నుంచి కన్జర్వేటివ్ భూమ్‌జాయ్‌థాయ్ పార్టీ విడిపోయింది.

### తిరుగుబాటు తప్పదా..?

ప్రస్తుతం థాయ్ పార్లమెంట్‌లో కనీసం 69 మంది ఎంపీలు ఆమెకు మద్దతు విరమించుకున్నారు. దీంతో షినవత్రాకు స్వల్ప మెజార్టీ మాత్రమే మిగిలింది. ఈ వివాదం ఇలాగే కొనసాగితే సంకీర్ణ ప్రభుత్వంలో తిరుగుబాటు తప్పదనే సంకేతాలు కన్పిస్తున్నాయి. అదే జరిగితే ప్రభుత్వం కుప్పకూలడం ఖాయం. దీంతో మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి వస్తుంది. థాయ్‌లాండ్ బిలియనీర్, మాజీ ప్రధాని తక్సిన్ షినవత్రా కుమార్తె అయిన షినవత్రా.. గతేడాది ఆగస్టులో ప్రధాని పదవిని చేపట్టారు. 37 ఏళ్లకే ప్రధాని పీఠాన్ని అధిష్టించిన ఆమె.. ఆ దేశ చరిత్రలోనే అతి పిన్న ప్రధానిగా, రెండో మహిళా ప్రధానిగా చరిత్ర సృష్టించారు. అంతేనా అందం, ఫ్యాషన్స్‌లోనూ స్టైల్ ఐకాన్‌గా, బ్యూటిఫుల్ పీఎంగా నెట్టింట విశేష ఆదరణ సొంతం చేసుకున్నారు.



## భారత్ కోసం గగనతలాన్ని తెరచిన ఇరాన్

### 1000 మంది విద్యార్థులు స్వదేశానికి

**ఇరాన్ :** ఇజ్రాయెల్-ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల తన గగనతలాన్ని మూసివేసిన ఇరాన్.. భారత్ కోసం ప్రత్యేకంగా మినహాయింపు ఇచ్చేందుకు సిద్ధమైంది. దీంతో ఇరాన్‌లో చిక్కుకుపోయిన దాదాపు 1000 మంది భారతీయులు కొన్ని గంటల్లో భారత్‌కు చేరుకోనున్నట్లు సమాచారం. 'ఆపరేషన్ సింధు'లో భాగంగా ప్రత్యేక విమానాల్లో వీరు స్వదేశానికి రానున్నారు. ఆపరేషన్ సింధులో భాగంగా ఇరాన్‌లోని పలు నగరాల నుంచి ప్రత్యేక విమానాలు భారత్‌కు రానున్నట్లు తెలుస్తోంది. తొలి విమానం శుక్రవారం రాత్రి 11 గంటలకు దిల్లీ చేరుకోనుండగా.. మరో రెండు విమానాలు శనివారం దిగనున్నట్లు సమాచారం. అయితే, దీనికి ముందు ఇరాన్ నుంచి ఇప్పటికే 110 మంది విద్యార్థులు దిల్లీకి చేరుకున్నప్పటికీ వీరు తొలుత ఆర్మేనియా.. అక్కడ నుంచి భారత్‌కు వచ్చారు. వారం క్రితం ఇజ్రాయెల్ చేసిన మెరుపు దాడులతో ఇరాన్‌లోని అనేక స్థావరాలు ధ్వంసమయ్యాయి. అనంతరం ఇజ్రాయెల్‌పై క్షిపణి, డ్రోన్‌లతో టెహ్రాన్ ప్రతిదాడులకు దిగింది. ఈ నేపథ్యంలోనే తన గగనతలాన్ని మూసివేయడంతో అంతర్జాతీయ విమాన సర్వీసులు నిలిచిపోయాయి. తాజాగా భారతీయ విద్యార్థులను తరలించేందుకు ఇరాన్ ప్రత్యేకంగా మినహాయింపు ఇవ్వడంతో తరలింపు ప్రక్రియ సులభం కానుంది. ఇదిలాఉంటే, ఇరాన్‌లో దాదాపు 4వేల మంది భారతీయులు ఉండగా.. అందులో 2వేల మంది విద్యార్థులేనని సమాచారం.

# అధికారం ముసుగులో అక్రమాలు..?

### అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారిన టౌన్ ప్లానింగ్ అధికారులు..!

- విషయం తెలిసి జోనల్ కమిషనర్ సీరియస్..?
- దొరికిన కాడికి దండుకుంటున్న నాయకులు..?
- కాలమ్ వేయగానే గద్దల్లా వాలిపోతారు..?
- సెల్లార్ కు ఒక రేటు.. బిల్డింగ్‌కి ఇంకో రేటు..?
- పార్టీ పేరుతో ఒక దందా... చడ్డీ దోస్తులతో మరో దందా










**కూకట్ పల్లి రాజముద్ర న్యూస్:** కొందరు నాయకులు చేసే మంచి పనులతో ప్రజల గుండెలో ఉండిపోతారు... మరి కొందరు నాయకులు ప్రజల సమస్యలు తీర్చక పోగా కొత్తగా సమస్యలు సృష్టిస్తారు. ఆ కోవకు చెందిన వారిలో ముందున్నారు కూకట్ పల్లి లోని కొందరు నాయకులు. కూకట్ పల్లి టౌన్ ప్లానింగ్ అధికారులు అధికార పార్టీ నాయకుల తొత్తులుగా మారిపోయారు. ఎక్కడ నిర్మాణం చేపడుతున్నా సరే ముందుగానే నాయకులకు సూచనలు ఇస్తున్నారు. ఫలానా ఏరియాలో అక్రమ నిర్మాణం జరగబోతోందనిపూర్తి సమాచారం పూస గుచ్చినట్లు ఇవ్వడంతో.. కాలమ్స్ పడ్డాయంటే చాలు ఆయా నిర్మాణాల వద్దకి ఒక పార్టీకి చెందిన నాయకుడి అనుచరులు గద్దల్లా వాలిపోయి నిర్మాణదారుడికి ఇష్టం లేకపోయినా సరే నీ అక్రమ నిర్మాణానికి అండగా మేముంటాం.. ఒక ఈగ వాలకుండా నిర్మాణం పూర్తయ్యే వరకు కాపాడుతాం అని కల్లబొల్లి మాటలు చెప్పి సదరు బిల్డర్ ను మభ్యపెట్టి దశలవారీగా లక్షల్లో మింగేస్తారు. తర్వాత వారి చెడ్డీ దోస్తుల తోటే కోర్టులో కేసులు వేయించి కోర్టులో కూడా మేమే చూసుకుంటాం మీకేం ఇబ్బంది లేదు అని మరికొన్ని లక్షలు మింగుతారు. మొన్నటి వరకూ నియోజక వర్గంలో వారెవరో కొందరికే తెలుసు.. ఇప్పుడు పార్టీ అధికారం లోకి వచ్చాక చిన్న చిన్న కార్యక్రమాలు చేస్తూ కొందరికి తెలిసిన వారయ్యారు. అధికారం ముసుగులో అందిన కాడికి దండుకుంటున్నారు. దందాలు, సెటిల్మెంట్లు, కబ్జాలు చేసుకుంటూ మూడు పూవులు ఆరు కాయలుగా హాయిగా అక్రమాలు చేసుకుంటూ పోతున్నారు. మళ్లీ ఒకరితో ఒకరికి గొడవలు రాకుండా పంపకాలు చేకుంటున్నారట. ఉదాహరణకి ఒక డివిజన్ ఒకరు చూసుకుంటే మరో డివిజన్ ఇంకొకరు అంటూ పంపకాలు చేసుకొని, వేరే వ్యక్తుల పేర్లతో కొన్ని నిర్మాణాల పైన టౌన్ ప్లానింగ్ విభాగంలో కంప్లైంట్లు పెట్టి సెటిల్మెంట్లకి వచ్చేవరకు ఆయా నిర్మాణదారుల్ని ఇబ్బందులకు గురిచేస్తూ బేరానికి వచ్చాక చిన్న సైట్ అయితే ఎనిమిది లక్షలు మొదలుకొని విస్తీర్ణాన్ని బట్టి దాదాపు 25 నుండి 30 లక్షల వరకు వసూలు చేస్తున్నారని పక్కా సమాచారం. ఒకవేళ కొన్ని నిర్మాణాలకి ఎటువంటి డివియేషన్ లేకపోయినా సరే పార్టీ పేరు చెప్పి లక్ష నుండి రెండు లక్షల వరకు సామాన్యుల ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నట్లు వినికిడి. కేవలం ఒక కెపిహెచ్బి డివిజన్ నుంచే పదుల సంఖ్యలో నడుస్తున్న అక్రమ నిర్మాణాల నుండి కోట్లలో వసూలు చేసినట్లు సదరు పార్టీకి చెందిన లీడర్లే అనుకుంటున్నారు. అలా అక్రమంగా రాబట్టిన ముడుపుల తోనే ఆటల పోటీలు, సేవా కార్యక్రమాలు, బారి కటౌట్లు బ్యాండ్ బాజా బారాత్‌లు చేస్తూ ఒక రేంజ్ లో హంగామాలు చేస్తున్నారని కూడా అనుకుంటున్నారు. నిర్మాణాల విషయంలో టౌన్ ప్లానింగ్ విభాగం వారు రాజకీయ నాయకులకు తొత్తులుగా మారడం పై జోనల్ కమిషనర్ కింది స్థాయి అధికారులకు మొట్టికాయలు గట్టిగానే వేస్తున్నట్లు వినికిడి. మరి ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకుంటారో లేదో...!




## 15 రోజుల్లోనే కొత్త ఓటరు కార్డు

### ఎలా అప్లయ్ చేయాలి?




**న్యూఢిల్లీ :** ఇకపై ఓటర్లకు కొత్త ఓటరు కార్డులను 15 రోజుల్లోగా డెలివరీ చేయనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా ప్రకటించింది. ఇప్పటివరకు ఓటర్లకు ఎలక్టర్ ఫొటో ఐడెంటిటీ కార్డ్ చేరేందుకు నెలకు పైగా సమయం పట్టేది. ఇకపై కొత్త ఓటర్లకు, ఇప్పటికే ఓటరుగా నమోదై వివరాల్లో మార్పులు, చేర్పులు చేసుకున్న వారికి కొత్త ఓటరు కార్డులు 15 రోజుల్లోగా అందనున్నాయి. ఇందుకోసం నూతన ప్రామాణిక నిర్వహణ విధానాన్నిని ప్రవేశపెట్టినట్లు ఈసీ తెలిపింది. ఎన్నికల నమోదు అధికారి ఎపిక్ జనరేట్ చేసినప్పటినుంచి ఓటరుకు పోస్టల్ విభాగం ద్వారా డెలివరీ అయ్యేవరకు ప్రతి దశలోనూ ఎస్సెమ్మెస్ ద్వారా సమాచారం అందుతుంది. ఓటర్ ఐడీ కార్డులను సజావుగా డెలివరీ చేసేందుకు వీలుగా ఎన్నికల సంఘం ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యేక ఐటీ మాడ్యూల్‌ను ప్రారంభించింది. ఇది పోస్టల్ విభాగంతో అనుసంధానమై పనిచేస్తుంది. ఇంతకీ ఎలా దరఖాస్తు చేయాలి? రియల్ టైమ్‌లో ఎలా ట్రాక్ చేయాలి?

### ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం ఎలా?

- ఎన్‌వీఎస్‌పీ వెబ్‌సైట్‌లోకి వెళ్లి, మీ ఫోన్ నంబర్, మెయిల్ ఐడీతో సైన్‌అప్ అవండి.
- క్రియేట్ అకౌంట్‌పై క్లిక్ చేసి మీ పేరు, పాస్‌వర్డ్ టైప్ చేసి పాస్‌వర్డ్‌ను నిర్ధరించండి.
- అనంతరం మీ మెయిల్ ఐడీకి ఓటీపీ వస్తుంది. ఓటీపీ నింపి మీ వివరాలను ధ్రువీకరించుకోవాలి.
- తర్వాత మీ మొబైల్ నంబర్, పాస్‌వర్డ్, క్యాప్చా నమోదు చేసి ఓటీపీతో లాగిన్ అవ్వండి.
- కొత్తగా నమోదు చేసుకుంటున్నట్లయితే (ఫారం-6 మీ వ్యక్తిగత వివరాలు, చిరునామా వంటివి) నమోదు చేయండి.
- అడిగిన డాక్యుమెంట్‌లను అప్‌లోడ్ చేసి.. మరోసారి మీ వివరాలను సరిచూసుకొని సబ్మిట్ చేయండి

### మీ అప్లికేషన్ స్టేటస్ తెలుసుకోండి ఇలా..

- ఎన్‌వీఎస్‌పీ పోర్టల్‌లో మీ మొబైల్ నంబరు, పాస్‌వర్డ్, క్యాప్చా నమోదు చేసి ఓటీపీతో లాగిన్ అవండి.
- ట్రాక్ అప్లికేషన్ స్టేటస్‌పై క్లిక్ చేసి.. మీరు అప్లయ్ చేసినప్పుడు ఎస్సెమ్మెస్‌లో వచ్చిన రిఫరెన్స్ నంబర్‌ను ఎంటర్ చేయండి.
- మీ రాష్ట్రం ఎంపిక చేసుకొని సబ్మిట్ చేయండి. తద్వారా మీ అప్లికేషన్ స్టేటస్ తెలుసుకోవచ్చు.

## ఎన్నికల వీడియోలు.. 45 రోజుల తర్వాత తొలగించండి

### రాష్ట్రాలకు ఈసీ సూచన

**న్యూఢిల్లీ :** ఎన్నికల సరళికి సంబంధించిన వీడియోలను దుర్వినియోగం చేసి తప్పుడు కథనాలు సృష్టించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ఫలితంపై 45 రోజుల్లోగా ఎలాంటి ఫిర్యాదులు రాకపోతే ఆ ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ కెమెరా రికార్డింగ్‌లు, వెబ్‌కాస్టింగ్, వీడియో ఫుటేజ్‌లను తొలగించాలని రాష్ట్ర ఎన్నికల అధికారులకు సూచించింది. దీనికి సంబంధించి రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులకు మే 30న లేఖలు పంపగా.. ఆ విషయం తాజాగా బయటికొచ్చింది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా పలు దశల్లో చేపట్టే ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సీసీటీవీ రికార్డింగ్, వెబ్‌కాస్టింగ్ విధానాలపై ఈసీ ఆ లేఖలో సూచనలు జారీ చేసింది. సాధారణంగా ఎన్నికలకు సంబంధించిన చట్టాల ప్రకారం.. ఈ రికార్డింగ్‌లు తప్పనిసరి కానప్పటికీ పారదర్శకత కోసం ఈసీ వీటిని ఓ సాధనంగా వినియోగిస్తోంది. అయితే, ఇటీవల ఈ రికార్డులను దుర్వినియోగం చేసి కొందరు సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, కథనాలను వ్యాప్తి చేస్తున్నట్లు ఎన్నికల సంఘం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారులకు ఈసీ పలు సూచనలు చేసింది. "ఎన్నికల ఫలితాన్ని సవాల్ చేస్తూ ఏ వ్యక్తి అయినా 45 రోజుల్లోపు సంబంధిత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసే వీలుంది. అందువల్ల పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ, వెబ్‌కాస్టింగ్, ఫొటోగ్రఫీ డేటాను ఫలితాలు వెలువడిన 45 రోజుల వరకు భద్రపర్చాలి. ఆలోగా సంబంధిత నియోజకవర్గంలో ఓటర్ల తీర్పును సవాల్ చేస్తూ ఎలాంటి పిటిషన్ దాఖలు కాకపోతే ఆ రికార్డింగ్‌లను ధ్వంసం చేయొచ్చు" అని ఈసీ అందులో స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన రికార్డింగ్‌లను దుర్వినియోగం చేయకుండా ఉండేందుకు గతేడాది డిసెంబరులో కేంద్ర చట్టంలో సవరణలు చేసింది. సీసీ కెమెరా, వెబ్‌కాస్టింగ్ ఫుటేజీ, అభ్యర్థుల వీడియో రికార్డింగ్‌లను బహిరంగంగా తనిఖీ చేయకుండా ఆంక్షలు తీసుకొచ్చింది.



## 8 ఎయిరిండియా విమాన సర్వీసులు రద్దు

**న్యూఢిల్లీ :** అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం తర్వాత నుంచి దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియా తరచుగా వార్తల్లో నిలుస్తోంది. ఈ దుర్ఘటనను మరవకముందే సంస్థకు చెందిన పలు విమానాల్లో సాంకేతిక సమస్యలు బయటపడటం కలవరపెడుతోంది. మరోవైపు, నిర్వహణ సమస్యలూ వెంటాడుతున్నాయి. దీని కారణంగా ఈ మధ్యకాలంలో పలు విమాన సర్వీసులు ఆలస్యమవుతున్నాయి. తాజాగా శుక్రవారం ఎనిమిది సర్వీసులను రద్దు చేసినట్లు ఎయిరిండియా ప్రకటించింది. మెయింటెనెన్స్, కార్యాచరణ సమస్యల కారణంగా వీటిని రద్దు చేసినట్లు వెల్లడించింది.

### రద్దయిన విమాన సర్వీసులు ఇవే..

- దుబాయ్ నుంచి చెన్నై రావాల్సిన ఏఐ906
- దిల్లీ నుంచి మెల్‌బోర్న్ వెళ్లాల్సిన ఏఐ308
- మెల్‌బోర్న్ నుంచి దిల్లీ రావాల్సిన ఏఐ309
- దుబాయ్ నుంచి హైదరాబాద్ రావాల్సిన ఏఐ2204
- పుణె నుంచి దిల్లీ వెళ్లాల్సిన ఏఐ874
- అహ్మదాబాద్ నుంచి దిల్లీ వెళ్లాల్సిన ఏఐ456
- హైదరాబాద్ నుంచి ముంబయి వెళ్లాల్సిన ఏఐ2872
- చెన్నై నుంచి ముంబయి వెళ్లాల్సిన ఏఐ571

నిర్వహణ సమస్యల కారణంగా జులై రెండోవారం వరకు తమ అంతర్జాతీయ విమాన సర్వీసులను 15 శాతం తగ్గించనున్నామని ఎయిరిండియా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే 16 అంతర్జాతీయ మార్గాల్లో విమాన సర్వీసులను తగ్గించినట్లు కంపెనీ ప్రకటించింది. జూన్ 21 నుంచి జులై 15 వరకు ఈ సర్వీసుల తగ్గింపు కొనసాగుతుందని విమానయాన సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఉత్తర అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియాల్లోని నగరాలకు వెళ్లే సర్వీసులపై ఈ ప్రభావం పడనుంది. మరోవైపు దిల్లీ-నైరోబి, అమృత్‌సర్-లండన్, గోవా-లండన్ సర్వీసులను వచ్చే నెల 15 వరకు నిలిపివేస్తున్నట్లు తెలిపింది. భారీగా ఉండే బోయింగ్ 777 విమానాల్లో మరింతగా తనిఖీలు చేపట్టనుండటం, ఇరాన్ గగనతల మూసివేతల కారణంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. ప్రభావితమయ్యే ప్రయాణికులకు క్షమాపణలు తెలిపింది.

# మొదటి రోజు భారత్‌దే

## జైస్వాల్, శుభ్‌మన్ సెంచరీలు..



**హెడింగ్లీ (లీడ్స్):** ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఇంగ్లాండ్‌తో జరుగుతున్న తొలి మ్యాచ్ మొదటి రోజు ఆటలో భారత్‌దే ఆధిపత్యం. కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లోనే శుభ్‌మన్ గిల్ (127, 175 బంతుల్లో 16 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించడం విశేషం. అతడితోపాటు ఓపెనర్ యశస్వి జైస్వాల్ (101బీ 159 బంతుల్లో 16 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో అలరించాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 3 వికెట్ల నష్టానికి 359 పరుగులతో పటిష్ఠ స్థితిలో నిలిచింది. రిషభ్ పంత్ (65, 102 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు) అర్ధ శతకం బాదాడు. కేఎల్ రాహుల్ (42) రాణించగా.. అరంగేట్ర ఆటగాడు సాయి సుదర్శన్ డకౌట్ అయి నిరాశపర్చాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో బెన్ స్టోక్స్ 2, బ్రైడన్ కార్స్ ఒక వికెట్ పడగొట్టారు.

### అదిరే ఆరంభం..

జైస్వాల్, రాహుల్ భారత్‌కు శుభారంభం అందించారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యం (151 బంతుల్లో) నెలకొల్పింది. ఆరంభంలో నెమ్మదిగా ఆడిన రాహుల్ తర్వాత నిలకడగా బౌండరీలు బాదాడు. స్టోక్స్ వేసిన 20వ ఓవర్‌లో చక్కటి కవర్ డ్రైవ్‌లతో వరుసగా రెండు ఫోర్లు రాబట్టాడు. అంతా బాగుందనుకున్న వేళ.. లంచ్ బ్రేక్‌కు ముందు భారత్ స్వల్ప వ్యవధిలో రెండు వికెట్లను కోల్పోయింది. అర్ధ శతకం దిశగా సాగుతున్న రాహుల్.. బ్రైడన్ కార్స్ వేసిన 24.5 ఓవర్‌కు ఫస్ట్ స్లిప్‌లో జో రూట్‌కు క్యాచ్ ఇచ్చాడు. తర్వాత వచ్చిన అరంగేట్ర ఆటగాడు సాయి సుదర్శన్ కలిసిరాలేదు. నాలుగు బంతులు ఎదుర్కొని డకౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. బెన్ స్టోక్స్ వేసిన 25.4 ఓవర్‌కు వికెట్‌కీపర్ జేమీ స్మిత్‌కు క్యాచ్ ఇచ్చాడు.



### గిల్, జైస్వాల్ దూకుడు.. మెరిసిన పంత్

రెండో సెషన్‌లో భారత బ్యాటర్ల ఆధిపత్యం కొనసాగింది. 92/2తో సెషన్‌ను ఆరంభించిన టీమ్ఇండియా.. గిల్, జైస్వాల్ దూకుడుగా ఆడటంతో టీ విరామ సమయానికి 215/2తో నిలిచింది. గిల్ 56 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. జైస్వాల్ 144 బంతుల్లో శతకం అందుకున్నాడు. ఇంగ్లాండ్ గడ్డపై ఆడిన తొలి ఇన్నింగ్స్‌లోనే శతకం బాదడం విశేషం. మూడో సెషన్ ఆరంభమైన కాసేపటికే జైస్వాల్ ఔటయ్యాడు. స్టోక్స్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో 129 పరుగుల భాగస్వామ్యానికి (163 బంతుల్లో) తెరపడింది. తర్వాత గిల్, పంత్ నిలకడగా ఆడారు. గిల్ 140 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్నాడు. జోష్ టంగ్ వేసిన 74.2 ఓవర్‌కు ఫోర్ బాది మూడంకెల స్కోరు అందుకున్నాడు. నిలకడగా ఆడిన పంత్ 91 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. పంత్, గిల్ అభేద్యమైన నాలుగో వికెట్‌కు 138 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. రెండో రోజు కూడా భారత బ్యాటర్లు జోరు కొనసాగించి భారీ స్కోరు చేస్తే మ్యాచ్‌పై టీమ్ఇండియా పట్టుబిగించడం ఖాయం.

## 5 బంతుల్లో 4 వికెట్లు..

### తమిళనాడు ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో అద్భుతమైన ఫీట్



క్రికెట్ అంటేనే అనూహ్య మలుపులు, ఉత్కంఠభరితమైన క్షణాలు. అలాంటి ఒక అద్భుత ఘట్టం తమిళనాడు ప్రీమియర్ లీగ్ 2025లో చోటు చేసుకుంది. సేలం వేదికగా జరిగిన ఒక మ్యాచ్‌లో సూర్య ఆనంద్ అనే యువ బౌలర్ తన అద్భుతమైన బౌలింగ్‌తో తన జట్టుకు అసాధారణ విజయాన్ని అందించా డు. చివరి ఓవర్‌లో 5 బంతుల్లో ఏకంగా 4 వికెట్లు పడగొట్టి, హ్యాట్రిక్ సాధించి, నెల్లై రాయల్ కింగ్స్‌ను నివ్వెరపరిచాడు. సీచెమ్ మదురై పాంథర్స్ వర్సెస్ నెల్లై రాయల్ కింగ్స్ మధ్య జరిగిన ఈ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. మదురై పాంథర్స్ బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లై రాయల్ కింగ్స్ విజయం దిశగా సాగుతోంది. చివరి రెండు ఓవర్లలో వారికి కేవలం 11 పరుగులు మాత్రమే అవసరం కాగా, చేతిలో 4 వికెట్లు ఉన్నాయి. నెల్లై విజయం దాదాపు ఖాయం అనిపించింది. అయితే, 19వ ఓవర్‌ను వేయడానికి సూర్య ఆనంద్ వచ్చాడు. అప్పటి వరకు నెల్లై జట్టు క్రీజ్‌లో నిలదొక్కుకున్న సోనూ యాదవ్ (32) ను మొదటి బంతికే అవుట్ చేసి సూర్య ఆనంద్ మదురైకి ఆశలు రేపాడు. తర్వాతి బంతి డాట్ బాల్. ఆ తర్వాత జరిగిన మూడు బంతుల్లో యుధీశ్వరన్ (0), సచిన్ రాఠీ (0), ఇమ్మాన్యుయేల్ చెరియన్ (0) లను వరుసగా అవుట్ చేసి సూర్య ఆనంద్ హ్యాట్రిక్ నమోదు చేయడంతో పాటు మొత్తం 5 బంతుల్లో 4 వికెట్లు పడగొట్టాడు. ఈ అనూహ్య బౌలింగ్‌తో నెల్లై రాయల్ కింగ్స్ 18.5 ఓవర్లలో 158 పరుగులకు ఆలౌట్ అయింది. ఫలితంగా, సీచెమ్ మదురై పాంథర్స్ 10 పరుగుల తేడాతో సంచలన విజయం సాధించింది. సూర్య ఆనంద్ ఈ అద్భుతమైన ప్రదర్శనతో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును గెలుచుకున్నాడు. అతని ఈ ప్రదర్శన కేవలం బౌలర్లు కూడా మ్యాచ్‌లను గెలిపించగలరని నిరూపించింది. ఈ విజయంతో మదురై పాంథర్స్ పాయింట్ల పట్టికలో తన స్థానాన్ని మెరుగు పరుచుకుంది.క్రికెట్ అభిమానులకు ఈ మ్యాచ్ ఒక చిరస్మరణీయ అనుభూతిని మిగిల్చింది. సూర్య ఆనంద్ అద్భుతమైన బౌలింగ్ చివరి క్షణాల్లో మ్యాచ్ స్వరూపాన్నే మార్చివేసింది. ఈ ప్రదర్శన తమిళనాడు ప్రీమియర్ లీగ్ చరిత్రలో ఒక ముఖ్యమైన భాగంగా నిలిచిపోతుంది. సూర్య ఆనంద్ లాంటి యువ ప్రతిభావంతులకు ఈ లీగ్ ఒక అద్భుతమైన వేదిక అని మరోసారి రుజువైంది.



## విమాన ప్రమాదం

### ఎయిరిండియా బుకింగ్స్‌పై ఎఫెక్ట్

**న్యూఢిల్లీ :** అహ్మదాబాద్ ఘోర విమాన ప్రమాద ఘటన ప్రభావం ఎయిరిండియా బుకింగ్స్‌పై పడింది. దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో 20 శాతం మేర బుకింగ్స్ క్షీణించాయి. టికెట్ ధరలు సైతం 8–15 శాతం మేర తగ్గుముఖం పట్టాయని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ ప్రెసిడెంట్ రవి గోసైన్ పేర్కొన్నారు. దీనిపై ఎయిరిండియా అధికారికంగా స్పందించలేదు. 242 మంది ప్రయాణికులతో లండన్ వెళుతున్న ఎయిరిండియా ఏఐ–171 విమానం అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన కాసేపటికే కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఒక్కరు మినహా ప్రయాణికులంతా దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన అనంతరం ముఖ్యంగా అంతర్జాతీయ రూట్లలో ఎయిరిండియా బుకింగ్స్ తగ్గుముఖం పట్టడాన్ని గమనించామని గోసైన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ రూట్లలో 18–22 శాతం మేర బుకింగ్స్ తగ్గుముఖం పట్టగా.. దేశీయ రూట్లలో 10–12 శాతం మేర ఎయిరిండియా బుకింగ్స్ క్షీణించినట్లు అంచనా వేశారు.

- ఎయిరిండియా విమాన టికెట్ ధరలు సైతం దేశీయ మార్గాల్లో 8–12 శాతం మేర తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్గాల్లో, ముఖ్యంగా యూరప్, ఆగ్నేసియా మార్గాల్లో 10–15 శాతం టికెట్ ధరలు తగ్గుముఖం పట్టాయని గోసైన్ పేర్కొన్నారు. డిమాండ్ లేమితో పాటు, ప్రమోషనల్ స్ట్రాటజీ కూడా టికెట్ ధరలు తగ్గడానికి కారణమని విశ్లేషించారు.
- టూర్ ఆపరేటర్ల ద్వారా ఎయిరిండియా విమానాలకు టికెట్లు బుక్ చేసుకున్న వాళ్లు కూడా వాటిని రద్దు చేసుకుంటున్నారని గోసైన్ పేర్కొన్నారు. కార్పొరేట్, ఉన్నత స్థాయి ప్రయాణికులు ప్రత్యామ్నాయ విమానాలను ఎంచుకున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ మార్గాల్లో టికెట్ల రద్దు 15–18 శాతంగా ఉండగా.. దేశీయ మార్గాల్లో ఇది 8–10 శాతంగా ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితి స్వల్పకాలం మాత్రమేనని, రానున్న రోజుల్లో ఇది తగ్గుముఖం పడుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు.
- ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఇన్ ఇండియన్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ జనరల్ సెక్రటరీ రాజీవ్ మెహ్రా సైతం ఎయిరిండియా టికెట్ బుకింగ్‌లు 20 శాతం మేర తగ్గుముఖం పట్టడం గమనించామని పేర్కొన్నారు. ఆ విమానయాన సంస్థకు చెందిన టికెట్ ధరలు కూడా 10 శాతం మేర క్షీణించాయని పేర్కొన్నారు.

## న్యూ సిటీ స్పోర్ట్ కారును లాంచ్ చేసిన హెూండా




భారత్‌లో ప్రీమియం కార్ల తయారీలో అగ్రగామిగా ఉన్న హెూండా కార్స్ ఇండియా లిమిటెడ్, ఈరోజు తన మిడ్ సైజ్ సెడాన్‌కు సంబంధించిన వేరియంట్ 'న్యూ సిటీ స్పోర్ట్'ను ప్రారంభించింది. యువ కొను గోలుదారులను ఆకర్షించడానికి రూపొం దించిన సిటీ స్పోర్ట్.. నలుపు రంగు యాక్సెంట్‌లతో స్పోర్టి ఎక్స్‌టీరియర్ స్టైలింగ్, కాంట్రాస్టింగ్ రెడ్ హైలైట్‌లతో, ప్రత్యేకమైన డ్రైవింగ్ అనుభవాన్ని అందిస్తుంది. 'లైఫ్ ఈజ్ ఎ స్పోర్ట్' అనే ట్యాగ్‌లైన్‌తో సిటీ స్పోర్ట్ పరిమిత యూనిట్లలో సిటీ లైనప్‌లో కొత్త గ్రేడ్‌గా అందుబాటులో ఉంటుంది. ఈ కారు ప్రత్యేకతను కోరుకునే వారి కోసం రూపొందించారు. ఇది ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌లో రేడియంట్ రెడ్ మెటాలిక్, ప్లాటినం వైట్ పెర్ల్, మీటియొరాయిడ్ గ్రే మెటాలిక్ అనే 3 రంగుల్లో వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది. ఎక్స్–షోరూం ధర రూ.14,88,900 పెర్ల్ కలర్ కారుపై అదనపు ధర వర్తిస్తుంది.

## భారీ లాభాల్లో సూచీలు

### 25వేల పైకి నిఫ్టీ



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నా మన సూచీలు రాణించడం గమనార్హం. దీంతో మూడు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ప్రధానంగా బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో, మెటల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు కూడా రాణించాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ వెయ్యికి పైగా పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 25,100 మార్కును దాటింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.4 లక్షల కోట్లు పెరిగి రూ.446.37 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 81,354.85 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,361.87) ఫ్లాట్‌గా ప్రారంభమైంది. రోజంతా భారీ లాభాల్లో కొనసాగింది. ఇంట్రాడేలో 82,494.49 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1046.30 పాయింట్ల లాభంతో 82,408.17 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 319 పాయింట్లు లాభపడి 25,112.40 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.59గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మారుతీ సుజుకీ మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, రిలయన్స్ ఇండస్ట్రీస్, నెస్లే ఇండియా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76 డాలర్లు కాగా.. బంగారం ఔన్సు 3372 డాలర్లు వద్ద కొనసాగుతోంది.

### సూచీల పరుగుకు కారణమిదీ..

- ఇటీవల సూచీలు వరుస నష్టాల నేపథ్యంలో ఆకర్షణీయంగా మారాయి. దీంతో కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు దిగినట్లు అనలిస్టులు భావిస్తున్నారు.
- గడిచిన మూడు సెషన్లలో విదేశీ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది.
- డాలర్ సూచీ క్షీణించి 98.57 స్థాయి వద్ద ట్రేడవుతుండడమూ మన మార్కెట్‌కు లాభించింది.

## యాపిల్.. ఫేస్‌బుక్.. గూగుల్.. 16 బిలియన్ల

# పాస్‌వర్డ్‌లు లీక్



డిజిటల్ యుగంలో సాంకేతికత వల్ల లాభాలే కాకుండా నష్టాలు కూడా తీవ్రమవుతున్నాయి. సాంకేతికతను ఉపయోగించుకొని సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పంథాల్లో ప్రజలను మోసం చేస్తున్నారు. దీంతో ఆన్‌లైన్ మోసాలు ప్రపంచవ్యాప్తంగా ఒక తీవ్రమైన సమస్యగా మారాయి. పలు ప్రముఖ సంస్థల డేటాలను కూడా సైబర్ నేరగాళ్లు సులభంగా లీక్ చేయగలుగుతున్నారు. తాజాగా యాపిల్.. ఫేస్‌బుక్.. గూగుల్.. వంటి ప్రముఖ సంస్థలకు చెందిన 16 బిలియన్ల పాస్‌వర్డ్‌లు లీక్ అయినట్లు సైబర్ భద్రతా పరిశోధకులు పేర్కొన్నాయి. ప్రపంచంలోనే ఇది అతిపెద్ద డేటా లీక్ ఉల్లంఘనల్లో ఒకటిగా తెలిపాయి. మే 23న విడుదలైన ఫోర్బ్స్‌లోని ఒక నివేదిక ప్రకారం.. యాపిల్, ఫేస్‌బుక్, గూగుల్, గిట్‌హబ్, టెలిగ్రామ్, ఇతర ప్రభుత్వ వెబ్‌సైట్ల యూజర్ల లాగిన్ వివరాలు లీక్ అయినట్లు తెలిపింది. వివిధ రకాల సామాజిక మాధ్యమాల ఖాతాలు, టెక్ సంస్థల యూజర్ల పాస్‌వర్డ్‌లు సైతం సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. గతంలో ప్రముఖ అంతర్జాతీయ సంస్థలకు చెందిన 184 మిలియన్ల యూజర్ల లాగిన్ వివరాలు, పాస్‌వర్డ్‌లు లీక్ అయినట్లు సైబర్ సెక్యూరిటీ నిపుణులు పేర్కొనగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 16 బిలియన్‌లకు చేరిందని అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. నివేదికల ప్రకారం.. సైబర్ భద్రతా పరిశోధకులు మొత్తం 30 డేటాసెట్‌లను కనుగొన్నారు. ఒక్కో డేటాసెట్‌లో 3.5 బిలియన్ రికార్డులు ఉన్నట్లు గుర్తించారు. సోషల్ మీడియా వీపీఎన్ లాగిన్‌లతో పాటు వివిధ కార్పొరేట్ డెవలపర్ ప్లాట్‌ఫారమ్‌లను కలిగిఉన్న సంస్థలకు చెందిన ఖాతాలలో 2025 ప్రారంభం నుంచి లాగిన్ అయిన అన్ని ఖాతాల వివరాలు వీటిలో రికార్డ్ అవుతున్నట్లు తెలిపారు. ఇటువంటి డేటా ఉల్లంఘనలను తప్పించుకోవడానికి గూగుల్ తన వినియోగదారులకు పాత సైన్ఇన్ పద్ధతులను మార్చి, మెయిళ్ల ద్వారా ఖాతాల భద్రతను అప్‌గ్రేడ్ చేయాలని సలహాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇందులోభాగంగానే గూగుల్ తన వినియోగదారులు వారి ఖాతాలపై మెరుగైన నియంత్రణ ఏర్పరుచుకోవడం కోసం ఖాతాలను పాస్‌కీలకు, సోషల్ సైన్–ఇన్‌లకు అప్‌గ్రేడ్ చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. పాస్‌కీలు అనేది స్మార్ట్‌ఫోన్ వంటి వాటి ద్వారా బయోమెట్రిక్ ప్రామాణీకరణతో పాస్‌వర్డ్‌లను భర్తీ చేసే లాగిన్ సిస్టమ్. గూగుల్ పాస్‌కీలను 'ఫిషింగ్ రెసిస్టెంట్'గా చూస్తోంది. ఇది వినియోగదారులు వారి పరికరాలను అన్‌లాక్ చేయడానికి వేలిముద్ర, ముఖ స్కాన్ వంటివి ఉపయోగించుకొని లాగిన్ అవ్వడానికి సహాయపడుతుంది.



## టూవీలర్లన్నింటికీ ఇక ఏబీఎస్

### వచ్చే ఏడాది నుంచి తప్పనిసరి

ద్విచక్ర వాహన ప్రమాదాలు తగ్గించేందుకు కేంద్రం ఓ కీలక నిర్ణయం తీసుకొనే దిశగా అడుగులు వేస్తోంది. దేశంలో అమ్ముడయ్యే టూవీలర్లన్నింటికీ యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్)ను తప్పనిసరి చేయనుంది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. ఈమేరకు త్వరలోనే కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం దేశీయంగా అమ్ముడవుతున్న 150 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం కలిగిన టూవీలర్లకే ఏబీఎస్ తప్పనిసరి అన్న నిబంధన అమలవుతోంది. ఇకపై ఎంట్రీ లెవల్ మోడళ్ల సహా అన్ని టూవీలర్లకూ దీన్ని తప్పనిసరి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశంలో మొత్తం ఎంట్రీ లెవల్ మోడళ్లే దాదాపు 75 శాతం వరకు ఉన్నాయి. 2022లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 20 శాతం వరకు టూవీలర్ల కారణంగా జరుగుతున్నాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

### పెరగనున్న ధరలు

ఏబీఎస్ నిబంధనను తప్పనిసరి చేస్తే ఆ మేర టూవీలర్ ధరలు పెరగనున్నాయి. ఏబీఎస్‌ను అమర్చడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఆ భారాన్ని కంపెనీలు వినియోగదారులకే బదిలీ చేస్తాయి. దీనివల్ల ఎంట్రీ లెవల్ టూవీలర్ మోడళ్ల ధరలు రూ.2500 నుంచి రూ.5వేల వరకు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ప్రమాదాలను అడ్డుకోవడంలో ఏబీఎస్ ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు.

### ఏబీఎస్ అంటే?

ఏబీఎస్ అంటే యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్. ఇది వాహనాల్లో ఉపయోగించే ఒక భద్రతా వ్యవస్థ. సడన్ బ్రేకింగ్ సమయంలో చక్రాలు లాక్ అవ్వకుండా నిరోధిస్తుంది. దీనివల్ల డ్రైవర్‌కు వాహనం మీద నియంత్రణ ఉంటుంది. వాహనం స్కిడ్ కాకుండా నివారిస్తుంది.

## హెచ్‌డీబీ ఫైనాన్షియల్ ఐపీఓ..




హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ధరల శ్రేణిని ప్రకటించింది. రూ.12,500 కోట్ల ఐపీఓలో భాగంగా ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.700–740గా కంపెనీ నిర్ణయించింది. గరిష్ఠ ధరల శ్రేణి వద్ద కంపెనీ మార్కెట్ విలువ రూ.61,400 కోట్లు కానుంది. తొలి పబ్లిక్ ఆఫర్ ఈనెల 25న ప్రారంభమై 27న ముగియనుంది. ఇందులో భాగంగా యాంకర్ మదుపర్లు ఈనెల 24న బిడ్లు దాఖలు చేసుకోవచ్చు. అర్హత కలిగిన కంపెనీ ఉద్యోగులు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వాటాదార్లకు ఐపీఓలో భాగంగా షేర్లను కేటాయించనున్నారు. ఐపీఓలో భాగంగా రూ.2,500 కోట్ల విలువైన తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో రూ.10,000 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విక్రయించనుంది. ప్రస్తుతం హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు 94.36% వాటా ఉంది. ఐపీఓ ద్వారా వచ్చిన నిధులతో కంపెనీ తమ టైర్–1 క్యాపిటల్ బేస్‌ను బలోపేతం చేసుకోనుంది. భవిష్యత్ వ్యాపార వృద్ధికి కొంత మొత్తాన్ని వినియోగించనుంది.

అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# 'కుబేర' మనసుల్ని కదిలిస్తాడు..

**రివ్యూ**

సున్నితమైన కథల్ని బలమైన భావోద్వేగాలతో నింపి ప్రేక్షకులకు హత్తుకునేలా చెప్పడంలో దర్శకుడు శేఖర్ కమ్ములది ప్రత్యేక శైలి. 'ఫిదా', 'లవ్ స్టోరీ' తర్వాత ఇప్పుడాయన 'కుబేర' అంటూ మరో ఆసక్తికర కథను తెరపైకి తీసుకొచ్చారు. ఇందులో ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో నటించడం.. టీజర్, ట్రైలర్, పాటలు అందరి దృష్టిని ఆకర్షించడంతో ఈ సినిమాపై ప్రేక్షకుల అంచనాలు రెట్టింపయ్యాయి. మరి 'కుబేర' కథేంటి? ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందించింది?

### కథేంటంటే..

దేశంలోనే అత్యంత సంపన్నుడైన గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ సీఈవో నీరజ్ మిత్ర (జిమ్ సర్భ్) ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా నిలవాలని కలలు కంటుంటాడు. ధన బలంతో దేశ రాజకీయ వ్యవస్థని చెప్పు చేతల్లో పెట్టుకున్న అతను.. లక్ష్యం సాధించడం కోసం ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సాగర్ ప్రాజెక్ట్‌ను వినియోగించుకోవాలనుకుంటాడు. దీని కోసం కేంద్రంలోని ఓ కీలక రాజకీయ నేత సిద్ధప్పతో రూ.లక్ష కోట్ల డీల్ కుదుర్చుకుంటాడు. ఆ మొత్తం డబ్బులో రూ.50 వేల కోట్లు బ్లాక్‌లో.. మిగిలిన డబ్బు వైట్‌లో ఇవ్వాలని నీరజ్‌కు సిద్ధప్ప షరతు విధిస్తాడు. ఈ పనిని సమర్థంగా చేయడం కోసం జైల్లో ఉన్న మాజీ సీబీఐ అధికారి దీపక్ తేజ్ (నాగార్జున) బయటకు తీసుకొస్తాడు. ఇందుకు దీపక్ ఓ ప్రణాళిక రచిస్తాడు. మొత్తం డబ్బును ట్రాన్స్‌ఫర్ చేయడానికి నలుగురు బిచ్చగాళ్లను ఎంచుకుంటాడు. వారి పేరిట విదేశాల్లో బ్యాంక్ ఖాతాలు, ఫేక్ కంపెనీలు సృష్టించి.. ఆ అకౌంట్స్ ద్వారా సిద్ధప్ప మనుషులకు డబ్బు పంపించేలా ప్లాన్ చేస్తాడు. ఈ పని పూర్తి కాగానే ఆ నలుగురు బిచ్చగాళ్లను చంపేయాలని నీరజ్ ప్లాన్ చేయగా.. వారిలో ఒకడైన దేవా (ధనుష్) తప్పించుకుంటాడు. దేవా స్విస్ ఖాతాలో ఉన్న రూ.10 వేల కోట్ల కోసం నీరజ్ – దీపక్ గ్యాంగ్ అతడిని వెతకడం మొదలు పెడుతుంది. మరి వీళ్ల చేతికి దేవా దొరికాడా? అతను బిచ్చగాడిగా ఎందుకు మారాల్సి వచ్చింది? దేవా జీవితంలోకి సమీరా (రష్మిక మందన) ఎలా వచ్చింది? తన ఖాతాలో ఉన్న వేల కోట్ల డబ్బును దేవా ఏం చేశాడు? అన్నది మిగిలిన కథ.

### ఎలా సాగిందంటే..

ధనవంతుల అత్యాశకు, పేదవాళ్ల ఆకలికి మధ్య జరిగే సంఘర్షణకు దృశ్య రూపమే ఈ చిత్రం. భిన్న ధ్రువాలైన ఈ ఇద్దరి వ్యక్తుల జీవితాలు ఒకదానితో ఒకటి ఎలా ముడిపడ్డాయి? వాళ్ల మధ్య సంఘర్షణ ఎందుకు తలెత్తిందనేది ఆసక్తికరం. ఈ పాయింట్‌ను దర్శకుడు చక్కగా తెరపైకి తీసుకొచ్చారు. సినిమా ఆరంభంలోనే ఆపరేషన్ సాగర్ ప్రాజెక్ట్ సీక్వెన్స్‌తో తను చెప్పాలనుకున్న పాయింట్‌ను సిద్ధం చేసుకున్నారు. సీబీఐ అధికారిగా దీపక్ పాత్రను పరిచయం చేసిన తీరు.. వ్యవస్థకు వ్యతిరేకంగా అతను పని చేయడానికి సిద్ధపడటం.. ఈ క్రమంలో నీరజ్ అవినీతి వ్యవహారంలో భాగమవ్వడం ఆసక్తిరేకెత్తించేలా ఉంటాయి. బిచ్చగాడు దేవా పాత్రలో ధనుష్ పరిచయ సన్నివేశాలు హృద్యంగా ఉంటాయి. దీపక్ సిద్ధం చేసిన బినామీ కుట్రలో అతను భాగమైన తీరు.. ఆ తర్వాత ఎదురయ్యే అనుభవాలు ఉత్కంఠ రేకెత్తిస్తూనే మనసుల్ని మెలిపెడుతుంటాయి. ప్రభుత్వ వ్యవస్థలో బినామీల పేరుతో వైట్ కాలర్ నేరాలు ఎలా జరుగుతాయన్నది చూపించిన తీరు బాగుంటుంది. ఓ వైపు బ్లాక్‌మనీ, బినామీ వ్యవస్థల్ని ప్రభావవంతంగా తెరపై చూపిస్తూనే.. మరోవైపు బెగ్గింగ్ మాఫియాకు బలవుతున్న చిన్నారుల జీవితాల్ని దేవా కోణం నుంచి ఆవిష్కరించిన తీరు ఆకట్టుకుంటుంది. దేవాని వెతికి పట్టుకునేందుకు నీరజ్ – దీపక్ టీమ్ చేసే ప్రయత్నాలతో ద్వితీయార్ధం ఆసక్తికరంగా మొదలవుతుంది. ఈ క్రమంలోనే సమీరా పాత్ర దేవా జీవితంలోకి రావడం.. అతడి వల్ల ఆమె ప్రాణాలకు ముప్పు ఏర్పడటం.. తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె కూడా దేవాతో కలిసి ప్రయాణం చేయాల్సి రావడం.. అన్నీ కథను రసవత్తరంగా మారుస్తాయి. దీపక్ తాను చేసిన తప్పు తెలుసుకుని.. నీరజ్‌కు ఎదురు తిరగడం మొదలు పెట్టినప్పటి నుంచి కథలో సంఘర్షణ రెట్టింపవుతుంది. ప్రీక్లైమాక్స్‌లో చావుకు ఎదురెళ్లిన దేవా.. నీరజ్‌ను సవాల్ చేసే తీరు... ఈ క్రమంలో తనకు చిక్కకుండా ముప్పుతిప్పలు పెట్టే విధానం.. అన్నీ అలరిస్తాయి. ముగింపు ఊహలకు తగ్గట్లే సాగుతుంది.

### ఎవరెలా చేశారంటే:

బిచ్చగాడిగా దేవా పాత్రలో ధనుష్ నటన కట్టిపడేస్తుంది. తన ఇమేజ్‌ను, స్టార్‌డమ్‌ను పక్కకు పెట్టి ఇలాంటి పాత్ర చేయడం సాహసమే. దీపక్ పాత్రలో నాగార్జున రెండు కోణాల్లో కనిపిస్తారు. ఆరంభంలో ప్రతినాయక ఛాయాలున్న పాత్రలో తనని ప్రేక్షకులు ఎంతగా ద్వేషిస్తారో.. పాత్రలో మార్పు వచ్చాక దాన్ని అంతకంటే ఎక్కువగా ప్రేమిస్తారు. రష్మిక ఈ కథలో ఓ కీలక పాత్ర లాగే కనిపిస్తుంది తప్ప ఓ రెగ్యులర్ కథానాయికగా ఎక్కడా ఉండదు. ప్రతినాయకుడిగా జిమ్ సర్భ్ స్టైలిష్‌గా కనిపిస్తూనే.. ఆద్యంతం భయపెట్టాడు. శేఖర్ కమ్ముల స్క్రీన్‌ప్లేని నడిపించిన తీరు బాగుంది. దేవిశ్రీ ప్రసాద్ నేపథ్య సంగీతం, పాటలు ప్రేక్షకుల్ని కథలో లీనం చేస్తాయి. కత్తెరకు పని చెప్పాల్సిన సన్నివేశాలు కొన్ని ఉన్నాయి.

# 'ప్రతీ సెకను శ్రమిస్తున్నా'

## 'వార్ 2'పై దర్శకుడు కీలక వ్యాఖ్యలు



ముంబయి: బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కీలక పాత్రల్లో నటిస్తోన్న చిత్రం 'వార్ 2'. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ సినిమా కోసం సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యంలోనే చిత్ర దర్శకుడు అయాన్ ముఖర్జీ ఈ ప్రాజెక్ట్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాజెక్ట్ విషయంలో తనపై ఎంతో బరువు బాధ్యతలు ఉన్నాయని చెప్పారు. ప్రేక్షకుల అంచనాలను దృష్టిలో ఉంచుకుని తాను వర్క్ చేస్తున్నానని అన్నారు. "వార్' చిత్రానికి ఎంతోమంది అభిమానులు ఉన్నారు. ఈ చిత్రానికి కొనసాగింపుగా వస్తోన్న చిత్రం కావడంతో 'వార్ 2' విషయంలో నాపై ఎంతో బాధ్యత ఉంది. ఇది నాకు దొరికిన గొప్ప అవకాశంగా భావిస్తున్నా. ఇలాంటి భారీ ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు ఆనందిస్తున్నా. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ వంటి స్టార్ హీరోలతో కలిసి వర్క్ చేస్తుండటంతో స్టోరీ లైన్ విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నా. యాక్షన్ పార్ట్స్, హృతిక్ రోషన్–ఎన్టీఆర్‌ల మధ్య ఘర్షణకు అవసరమైన వివాదాన్ని చూపించడం వంటి విషయాల కోసం ఎక్కువ సమయం తీసుకున్నా. ఇద్దరు స్టార్ హీరోలు కలిసి చేసిన సినిమా కావడంతో ఇది నిజమైన ఇండియన్ సినిమా కానుంది. ఈ సినిమాపై అభిమానులు ఏవిధమైన అంచనాలు పెట్టుకున్నారో నాకు తెలుసు. థియేటర్లలో కూర్చున్నప్పుడు వారికి జీవితాంతం గుర్తుండిపోయే అనుభూతిని ఇచ్చేందుకు ప్రతి సెకన్ పనిచేస్తున్నా" అని అయాన్ ముఖర్జీ తెలిపారు. యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న స్పై యూనివర్స్‌లో భాగంగా వస్తున్న ఆరో చిత్రమిది. 2019లో విడుదలైన 'వార్'కు కొనసాగింపుగా ఇది రూపొందుతోంది. కియారా అద్వాణీ కథానాయిక. ఆగస్టు 14న ఇది ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఎన్టీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని చిత్రబృందం ఇటీవల 'వార్ 2' టీజర్ విడుదల చేసిన విషయం తెలిసిందే. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ఢీ అంటే ఢీ అన్నట్టుగా తలపడే సన్నివేశాలు, యాక్షన్ హంగామా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# నాని హిట్-3 సినిమాకు చిక్కులు

## కథను కాపీ కొట్టారంటూ కోర్టుకెక్కిన రచయిత

నాచురల్ స్టార్ నాని హీరోగా, శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హిట్–3'. మే 1వ విడుదలైన ఈ సినిమా ఘన విజయం సాధించింది. నాని కెరీర్‌లోనే 100 కోట్ల క్లబ్‌లో చేరింది. అయితే తాజాగా ఈ సినిమా చిక్కుల్లో పడింది. ఈ సినిమాలో తన కథను కాపీ కొట్టారని అంటూ.. ఓమహిళ కోర్టుకెక్కింది. హిట్–1, హిట్–2 చిత్రాల సిరీస్‌లో భాగంగా శైలేష్ హిట్–3ని తెరకెక్కించారు. అయితే తన స్టోరీని కాపీ కొట్టారంటూ మహిళా రచయిత విమల్ సోని మద్రాస్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అంతేకాక విమల్ సోని నానికి వీరాభిమాని అని పేర్కొన్నారు. తాను రాసిన ఏజెంట్ 11, ఏజెంట్ కథల నుంచి హిట్–3 సినిమాను తీశారని ఆమె తెలిపారు. దీంతో హిట్–3 మేకర్స్‌పై కాపీరైట్ కేసు వేశారు. ఆమె రచించిన ఒరిజినల్ కాపీని కోర్టుకు సమర్పించారు. అయితే గతంలో కూడా దర్శకుడు శైలేష్ కొలను ఇలాంటి వివాదాన్ని ఎదురుకున్నారు. వెంకటేష్ హీరోగా ఆయన 'సైంధవ్' అనే సినిమాను తెరకెక్కించిన విషయం తెలిసిందే. ఈ సినిమా కథను కూడా కాపీ కొట్టారు అంటూ అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.





# కారవాన్‌లో ఏడ్చేసి.. ఏం జరగనట్లు బయటకు వచ్చేదాన్ని: నటి

**హైదరాబాద్:** భిన్నమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు తెలుగమ్మాయి అనన్య నాగళ్ల. తన బ్రేకప్ స్టోరీ గురించి తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. ఆ బాధను తట్టుకోలేకపోయానన్నారు. "కెరీర్ పరంగా ఒడుదొడుకులు, సవాళ్లను స్వీకరించడం అలవాటు చేసుకున్నా. ప్రశంసలతోపాటు విమర్శలనూ తట్టుకున్నాను. కానీ, వ్యక్తిగత జీవితంలో ప్రేమలో విఫలమైనప్పుడు మాత్రం ఎంతో బాధపడ్డా. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కొంతకాలానికి బ్రేకప్ జరిగింది. రెండేళ్ల పాటు ఆ బాధను అనుభవించాను. అయితే.. చేసే పనిపై ఆ ప్రభావాన్ని పడనీయలేదు. రాత్రంతా ఏడ్చేసి ఉదయాన్నే జిమ్‌కు వెళ్లిపోయేదాన్ని. కారవాన్‌లో ఏడ్చేసి.. ఆ తర్వాత ఏం జరగనట్లు బయటకు వచ్చేదాన్ని. ఇంట్లో వాళ్లకు కూడా దీని గురించి తెలియదు. నా స్నేహితులకు మాత్రమే తెలుసు" అని అనన్య తెలిపారు. బాలీవుడ్‌లో తానొక ప్రాజెక్ట్ చేస్తున్నట్లు ఆమె చెప్పారు. కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రమన్నారు. 'మల్లేశం' (2018) సినిమాతో తెరంగేట్రం చేసి.. తొలి ప్రయత్నంలోనే ప్రేక్షకులను మెప్పించారు అనన్య. అనతి కాలంలోనే పవన్ కల్యాణ్ సినిమా 'వకీల్‌సాబ్'లో కీలక పాత్ర పోషించారు. 'శాకుంతలం', 'తంత్ర', 'డార్లింగ్'.. ఇలా విభిన్న కథా చిత్రాల్లో భాగమయ్యారు. 'పొట్టేల్' సినిమాలో నటనకుగానూ 'గద్దర్' స్పెషల్ జ్యూరీ అవార్డు అందుకున్నారు.

# 8 వసంతాలు... కొత్త ప్రయత్నం

అగ్ర నిర్మాణ సంస్థలు అప్పుడప్పుడూ కొత్తతరంతో... పరిమిత వ్యయంతో కూడిన సినిమాలు కూడా నిర్మిస్తుంటాయి. అలా మైత్రీ మూవీ మేకర్స్ నుంచి వచ్చిన చిత్రమే... '8 వసంతాలు'. పలువురు కొత్తతరం నటులు కలిసి నటించిన ఈ చిత్రం ఎలా ఉంది? ఎలాంటి వినోదాన్ని అందించింది?

**రివ్యూ**




### కథేంటంటే..

ఓ ప్రేమజంట జీవితంలోని 8 వసంతాల కథ ఇది. శుద్ధి అయోధ్య (అనంతిక సనీల్‌కుమార్) అనే యువతి ఓ రచయిత. ఊటీలో ఉంటూ తన టీనేజ్‌లోనే ఓ పుస్తకం రాస్తుంది. దాంతో ఎంతోమంది అభిమానుల్ని సొంతం చేసుకుంటుంది. మార్షల్ ఆర్ట్స్‌లోనూ ఆమె ప్రావీణ్యం సంపాదిస్తుంది. ప్రయాణాలు, రచనలు, మార్షల్ ఆర్ట్స్‌తో గడుపుతున్న ఆమె జీవితంలోకి వరుణ్ (హను రెడ్డి) వస్తాడు. కొన్ని రోజుల్లోనే ఇద్దరి మనసులు కలుస్తాయి. వరుణ్ తన మనసులోని మాటని చెబుతాడు. శుద్ధి కొంత సమయం కావాలని కోరుతుంది. అందుకు వరుణ్ కూడా అంగీకారం చెబుతాడు. అలా కొన్ని నెలలు గడిచిపోతాయి. ఆ తర్వాత శుద్ధి తన మనసులోని ప్రేమని వ్యక్తపరచాలని ఎంతో ఆత్రుతగా వరుణ్ దగ్గరికి వస్తుంది. మరి వరుణ్... ఆమె ప్రేమని స్వీకరించాడా? ఈ మధ్యలో వరుణ్ జీవితంలో ఏం జరిగింది? వరుణ్ విదేశాలకు వెళ్లిపోయిన తర్వాత ఆమె జీవితంలోకి వచ్చిన సంజయ్ ఎవరు? శుద్ధి ఎనిమిది వసంతాల ప్రేమ ప్రయాణంలో ఎన్నో మలుపులు చోటుచేసుకున్నాయన్నది చిత్ర కథ.

### ఎలా ఉందంటే..

కవితాత్మకంగా సాగే ఓ ప్రేమకథ ఇది. తెరపైన కనిపించే ప్రతి ఫ్రేమ్... ప్రతి సంభాషణ భావుకతని నింపుకొని ఉంటాయి. విజువల్స్ వరకూ కట్టిపడేసినా... ఒక దశ దాటిన తర్వాత సంభాషణలే కృత్రిమంగా అనిపిస్తాయి. అవి సినిమాపై ఏమాత్రం ప్రభావం చూపించకపోగా, పాత్రలతో పనిగట్టుకొని పలికించినట్టుగా అనిపిస్తాయి. భావుకత గురించి ఎక్కువగా ఆలోచించిన దర్శకుడు... భావోద్వేగాల సంగతిని మరిచిపోయాడు. దాంతో కథ హృదయాల్ని తాకదు. కథనం నెమ్మదిస్తుంది. ప్రేమకథ అనగానే ఎక్కడో ఒకచోట తెరపై కనిపించే పాత్రల్లో తమని తాము చూసుకుంటారు ప్రేక్షకులు. ప్రేమ అనేది ప్రతిఒక్కరికీ అనుభవమైన భావోద్వేగమే కాబట్టి, ఆ కనెక్షన్ ఉంటుంది. కానీ, ఈ సినిమాలోని హార్ట్ బ్రేక్ సన్నివేశాలే తప్ప, ఏ పాత్రతోనూ ప్రేక్షకుడు ప్రయాణం చేయలేడు. కొంతలో కొంత ప్రథమార్ధం ఈ సినిమాకి బలం. వరుణ్, శుద్ధి కలవడం, ఆ ఇద్దరి మధ్య ప్రేమ చిగురించే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. విరామ సన్నివేశాలు ద్వితీయార్ధంపై ఆసక్తిని పెంచుతాయి. అందంగా కనిపించిన హను రెడ్డి, అనంత మధ్య కెమిస్ట్రీ, హెషామ్ సంగీతం సినిమాని ఆకర్షణీయంగా మార్చేశాయి. అయితే విరామం తర్వాత సినిమా పూర్తిగా గాడి తప్పినట్లు అనిపించింది. ద్వితీయార్ధంలోని ప్రేమకథలో ఏమాత్రం బలం లేకపోగా, చాలా సన్నివేశాలు మెలోడ్రామాని తలపిస్తాయి. సంజయ్ రాసిన రాణిమాలిని అనే వేశ్య కథని చదివి, అతనితో ప్రేమలో పడటం కానీ, ఆ ప్రేమని త్యాగం చేయాలనుకోవడం కానీ ఏమాత్రం సహజంగా అనిపించదు. ప్రథమార్ధంలో శుద్ధి పాత్ర ఎంత బలంగా, ఎంత హుందాగా కనిపిస్తుందో... చివరికి వచ్చేసరికి ఆ పాత్ర తాలూకు ప్రభావం తగ్గిపోతుంది. సంజయ్ పాత్ర తెర పైకి వచ్చిన ప్రతిసారీ సన్నివేశాలు ఓ పుస్తకాన్ని ఏకధాటిగా చదువుతున్నట్టుగా, ఓ ప్రసంగంలా సాగిపోతుంటాయి. మొత్తంగా కవిత్వంతో పాటు, ఆకట్టుకునేలా కథ కూడా చెబితే ఇంకాస్త బాగుండనే అభిప్రాయాన్ని కలిగిస్తుందీ చిత్రం.

### ఎవరెలా చేశారంటే..

అనంతిక సనిల్‌కుమార్ అందం, ఆమె నటన ఈ సినిమాకి ప్రత్యేకం. ఆమె స్క్రీన్ ప్రజెన్స్ ప్రేక్షకుల్ని కళ్లు తిప్పుకోనీయకుండా చేస్తుంది. హావభావాలు అద్భుతం అనిపిస్తాయి. ముఖ్యంగా విరామానికి ముందు, ద్వితీయార్ధం మొదలయ్యాక వచ్చే సన్నివేశాలతోపాటు, వారణాశిలో సాగే పోరాటం అనంతికలోని అత్యుత్తమ ప్రతిభని ఆవిష్కరిస్తాయి. లవర్‌బాయ్‌గా కనిపించిన హను రెడ్డి ప్రేమకథలకి తగ్గ హీరో అనిపిస్తాడు. అతని స్క్రీన్ ప్రజెన్స్ కూడా చాలా బాగుంది. భావోద్వేగాలతోనూ మెప్పిస్తాడు. మరో నటుడు రవి దుగ్గిరాల తన పాత్రకు న్యాయం చేశాడు. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. ముఖ్యంగా విశ్వనాథ్ రెడ్డి కెమెరా పనితనం అద్భుతం అనిపిస్తుంది. ఊటీ, కశ్మీర్ అందాల్ని ఆయన తన కెమెరాతో చూపించిన తీరు మణిరత్నం సినిమాల్ని గుర్తు చేస్తుంది. హెషామ్ సంగీతం మరో హైలైట్. దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి కవితాత్మక స్పర్శతో కథని చెప్పాలనుకోవడం మెచ్చుకోదగ్గ ప్రయత్నమే. ఆయన సంభాషణలు చాలాచోట్ల ఆకట్టుకుంటాయి. అదేస్థాయి కసరత్తులు కథ, కథనాల విషయంలోనూ చేయాలని గుర్తు చేస్తుందీ చిత్రం. నిర్మాణం ఉన్నతంగా ఉంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98,
**RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com